సమగ్ర సమాచార పత్రిక


# ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
గురువారం, 05.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13 సంచిక: 000
పేజీలు: 12 వెల: రూ. 5


## ప్రభుత్వ కార్యాలయాల్లో

# దొంగలు!

### తెలంగాణలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు

### ఐఎఫ్ఎంఎస్ ద్వారా జీతాల చెల్లింపుల నిర్ణయంతో బయటపడిన భారీ అక్రమాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :** ప్రభుత్వ కార్యాలయాల్లో దొంగలుపడ్డారు. ఎలాంటి అర్హత లేకుండానే 25వేలకు పైగా మంది అడ్డదారిలో ఉద్యోగాలు సంపాదించుకున్నారు. ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలు, పలు ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తోన్న అధికారుల చేతులు తడిపి అక్రమ మార్గంలో పోస్టింగ్ లు పొందారు. ప్రతి నెలా ప్రభుత్వం నుంచి రూ.వేలల్లో వేతనాలు తీసుకుంటూ భారీ మోసానికి తెరలేపారు. ప్రస్తుతం రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ ఐఎఫ్ఎంఎస్ విధానం ద్వారా జీతాలు అందించాలని నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ సర్కార్ వారి వివరాలు సేకరించింది. దీంతో రాష్ట్రంలో వివిధ శాఖల్లో విధులు నిర్వర్తిస్తోన్న దాదాపు 1.70 లక్షల మంది అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగుల్లో 25వేల మంది కనీసం ఆధార్ కార్డులు కూడా లేకుండా, కేవలం కాగితాల మీద పేర్లు సృష్టించి ఏజెన్సీలు ఏళ్ల తరబడి జీతాలు డ్రా చేస్తున్నట్లు తేలింది. అక్రమ మార్గంలో ఉద్యోగాలు సంపాదించుకుని ప్రతి నెల రూ.వేలల్లో పొందుతున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. అలాంటి వారిని గుర్తించి వారిని నియమించిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నిజిల్లాల కలెక్టర్లను ఆదేశించడం ఉద్యోగ వర్గాల్లో సంచలనం రేపింది. ఈ క్రమంలో ఈ నెల 3న రాష్ట్ర సచివాలయంలో అన్ని జిల్లాల కలెక్టర్లతో మిగతా 02లో

- కాగితాల మీద పేర్లు సృష్టించి ఏళ్ల తరబడి జీతాలు డ్రా చేసిన ఏజెన్సీలు
- రాష్ట్రవ్యాప్తంగా 1.70 లక్షల ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వివరాల పరిశీలనలో వెలుగులోకి వచ్చిన మోసం
- ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో బినామీ ఉద్యోగుల గుట్టు రట్టు
- మధ్యవర్తుల దోపిడీకి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం నేరుగా ఖాతాల్లో జీతాలు
- బోగస్ ఉద్యోగులను నియమించిన ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలపై క్రిమినల్ కేసులకు సిద్ధం
- పీఎఫ్, ఈఎస్ఐ నిధులు కూడా పక్కదారి పట్టించిన ఏజెన్సీల దందా బట్ట బయలు
- బోగస్ ఉద్యోగుల వ్యవహారంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సీఎం ఆదేశాలు
- జిల్లా కలెక్టర్లతో సమావేశంలో 25 వేల బోగస్ ఉద్యోగుల విషయాన్ని వెల్లడించిన సీఎం

## రాహుల్ ను ప్రధానిగా చూడాలనుకోవడం మా హక్కు

పొన్నం ప్రభాకర్



- బండి సంజయ్ సెటైర్లకు ఘాటైన కౌంటర్
- పీఎం పదవి ప్రజల తీర్పుతోనే నిర్ణయం అవుతుంది
- మోదీ పాలనలో దేశాన్ని కార్పొరేట్లకు అప్పగించారని ఆరోపణ

03

## రేషన్ కార్డుల తొలగింపు!?

### ఆరు నెలలు రేషన్ తీసుకోకుంటే రద్దు

- ఎండల దృష్ట్యా కేంద్రం కీలక నిర్ణయం
- బియ్యం పక్కదారి పడుతున్నట్లు గుర్తింపు
- తెలంగాణలో పెరిగిన కొత్త రేషన్ కార్డులు
- సన్నబియ్యం నిల్వలపై ప్రభుత్వం కసరత్తు
- రేషన్ బియ్యం అమ్మేవారిపై నిఘా
- ఒకేసారి పంపిణీతో డీలర్లకు నిల్వ సమస్యలు
- సర్వర్ ఇబ్బందులపై లబ్ధిదారుల ఆందోళన

అనర్హుల గుర్తింపుపై క్షేత్రస్థాయిలో సర్వే

ఏప్రిల్ లో ఒకేసారి 3 నెలల బియ్యం పంపిణీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో రేషన్ సరఫరాలో ప్రభుత్వం కీలక మార్పులకు సమాయత్తం అవుతోంది. ప్రతీ నెలా ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సన్న బియ్యం కొందరు లబ్దిదారులు తీసుకోవటం లేదనే అంశం ప్రభుత్వానికి నివేదికలు అందాయి. దీంతో.. అనర్హులను గుర్తించే అంశంపైన ప్రభుత్వం ఫోకస్ చేసింది. ఈ మేరకు పౌర సరఫరాల శాఖ మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పూర్తి లెక్కలు చేపట్టే పని ప్రారంభించింది. రేషన్ లబ్ధిదారుల్లో వరుసగా గత ఆరు నెలలుగా ఎవరెవరు బియ్యం తీసుకోవడం లేదో, ఆ వివరాలను పౌర సరఫరాల శాఖ కమిషనర్ కార్యాలయం నుంచి మండల తహశీల్దార్ ఆఫీస్ లాగిన్‌కు సిబ్బంది పంపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పెద్ద సంఖ్యలో కొత్త కార్డులను మంజూరు చేసింది. వీరిలో చాలామంది సన్న బియ్యం తీసుకోవటం లేదని గుర్తించారు. దీంతో అసలు మిగతా 02లో

## డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు

### మాదకద్రవ్యాల స్థావరాలపై దాడులు



రూ.22 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత ముగ్గురు విదేశీయులతో సహా ఆరుగురు అరెస్ట్ హైదరాబాద్ నార్కోటిక్స్ ఎన్ఫోర్స్మెంట్ వింగ్ 10

## విద్యాకమిషన్‌పై ఆరోపణలు అర్థరహితం

03

### ప్రభుత్వ సలహాదారు కేశవరావు



- విద్యాకమిషన్ నివేదికపై అనవసర రచ్చ చేస్తున్న ప్రతిపక్షాలు
- అనేక మంది నిపుణులతో చర్చల తర్వాతే కమిషన్ రిపోర్టు సిద్ధమైంది
- టీచర్ల జీతాల అంశాన్ని వక్రీకరిస్తున్నారు.. వారి సేవలకు విలువ కట్టలేం
- కమిషన్‌లో విద్యావేత్తలు లేరన్న విమర్శలను ఖండించిన ప్రభుత్వ సలహాదారు

## ప్రాజెక్టుల భూసేకరణకు రూ. 5వేల కోట్లు

### జూన్ 2 నాటికి అన్ని ప్రాజెక్టుల భూసేకరణ పూర్తి

03

- సింగూర్ భద్రతకు తొలి ప్రాధాన్యత
- సింగూర్ పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీపడం
- పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు, రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా..
- అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు



## సీఎంగా నితీష్ కుమార్ రాజీనామా?

03

### బీజేపీకి సీఎం పదవి.. నితీష్‌కు రాజ్యసభ మార్గం?

- ఢిల్లీలో ఒప్పందం జరిగిందన్న జాతీయ మీడియా కథనాలు
- నిశాంత్ కుమార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి అవకాశమా?
- బిహార్ రాజకీయాల్లో ఒక్కసారిగా మారిన సమీకరణాలు
- ఎన్డీఏలో సీఎం మార్పుపై ఊహాగానాలు జోరుగా ప్రచారం



## ఇరాన్ కు హ్యాండ్ ఇచ్చిన రష్యా, చైనా

### కష్టకాలంలో ఇరాన్‌కు అండగా నిలవని మిత్రదేశాలు



- ఖమేనీ హత్యపై మాటలకే పరిమితమైన దేశాలు
- వ్యూహాత్మక మైత్రి ఉన్నా సైనిక సహాయంపై మాస్కో, బీజింగ్ మౌనం
- ఇరాన్ సంక్షోభం అంతర్జాతీయ రాజకీయ సమీకరణాలపై ప్రశ్నలు లేవనెత్తుతోంది
- ఉక్రెయిన్ యుద్ధం, ఆర్థిక ఆంక్షల ఒత్తిడితో రష్యా వెనుకంజ?
- చమురు సంబంధాలు ఉన్నా ఇరాన్‌కు చైనా ప్రత్యక్ష అండ కనిపించలేదు

02

- మిత్రదేశాల భద్రతకు రష్యా, చైనా ఎంతవరకు హామీ ఇస్తాయన్న సందేహాలు
- అమెరికాతో ఉద్రిక్తతల భయంతో జాగ్రత్తగా అడుగులు వేస్తున్న బీజింగ్
- వెనెజువెలా, సిరియా ఉదాహరణలతో రష్యా మద్దతుపై కొత్త చర్చ
- ఇరాన్ పరిణామాలు ప్రపంచ శక్తి సమీకరణాల్లో మార్పులకు సంకేతం

## జైల్లో టార్చర్ పెట్టారు

### ఆవేదన వ్యక్తం చేసిన బాల్క సుమన్




- నా అరెస్ట్ కక్ష సాధింపే
- హోలీ పండుగకు, కుమారుడి పుట్టిన రోజుకు దూరం చేశారు

03

## కివీస్ అలెన్ సునామీ

*టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయింది. సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికా విసిరిన 170 పరుగుల సవాల్‌ను కివీస్ ఓపెనర్లు ఆటవస్తువులా మార్చేశారు. ముఖ్యంగా ఫిన్ అలెన్ కళ్లు చెదిరే సెంచరీతో సఫారీ బౌలింగ్‌ను చీల్చిచెండాడడంతో, మరో 43 బంతులు మిగిలి ఉండగానే న్యూజిలాండ్ 10 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఇప్పుడు క్రికెట్ ప్రపంచం అంతా రేపు జరగబోయే భారత్–ఇంగ్లండ్ పోరు వైపు చూస్తోంది, ఇందులో గెలిచిన వారితోనే కివీస్ టైటిల్ వేటలో తలపడనుంది.*




## యుద్ధం అక్కడ.. సెగ ఇక్కడ!

- మధ్యప్రాచ్య యుద్ధ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడే సూచనలు
- చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం.. ఇంధన సంక్షోభం భయం
- గల్ఫ్‌లో 80 లక్షల భారతీయుల భవిష్యత్తుపై ఆందోళన
- విదేశీ కరెన్సీ ప్రవాహం తగ్గే ప్రమాదం.. రూపాయి విలువపై ఒత్తిడి
- ఎగుమతులు, దిగుమతులు నిలిచే పరిస్థితి.. ఆర్థిక వ్యవస్థకు షాక్
- అంతర్జాతీయ ఉద్రిక్తతలతో బంగారం, వెండి ధరలకు రెక్కలు

10


## యుద్ధాల కొత్త యుగం.. డ్రోన్లే ఆయుధం!

### భారీ బాంబర్ల నుంచి స్మార్ట్ డ్రోన్ల వరకు మారిపోయిన యుద్ధ తంత్రాలు



- అమెరికా, ఇరాన్ సొంత డ్రోన్లతో గగనతలంలో ఆధిపత్య పోరు
- ప్రపంచ దేశాలు స్వదేశీ డ్రోన్ టెక్నాలజీపై దృష్టి
- భారత్ అభివృద్ధి చేస్తున్న 'శేష్ నాగ్-150' డ్రోన్ పై ఆసక్తి
- 1000 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను ఛేధించే సామర్థ్యం

03



## ఇరాన్ చరిత్ర




ఇరాన్ చరిత్ర ఆచేమెనిడ్ సామ్రాజ్యం ( క్రి.పూ. 550)సైరస్ ది గ్రేట్ స్థాపించిన ఈ సామ్రాజ్యం ప్రపంచంలోనే మొదటి భారీ సామ్రాజ్యాలలో ఒకటి. పర్షియా నుంచి భారతదేశం వరకు విస్తరించి గొప్ప

## ప్రభుత్వ కార్యాలయాల్లో
# దొంగలు పడ్డారు



**(మొదటి పేజీ తరువాయి)**
సమావేశమైన సీఎం రేవంత్ రెడ్డి... తెలంగాణలో 25 వేల మంది బోగస్ ఉద్యోగులు ఉన్నట్లు తాము గుర్తించామని వెల్లడించారు.దాదాపు 25 వేల మంది కనీసం ఆధార్ కార్డు లేకుండా బోగస్ ఉద్యోగులుగా ఇంతకాలం జీతాలు తీసుకున్నారని తెలిపారు. బోగస్ ఉద్యోగులను సృష్టించే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీల విషయంలో కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. వాటన్నింటిపైనా ఆడిట్ చేయించి ఆర్థిక శాఖ అధికారులు కేసులు నమోదు చేయాలని సీఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ చేశారు. కాగా ప్రభుత్వ యంత్రాంగంలో పేరుకుపోయిన అవినీతిని ప్రక్షాళన చేసే దిశగా అడుగులు వేస్తోన్న సీఎం.. రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న 'బోగస్' ఉద్యోగుల వ్యవహారాన్ని బయటపెట్టడం ఇప్పుడు రాజకీయ పరిపాలనా వర్గాల్లో చర్చకు దారితీసింది.

**బయటపడిందిలా...**
రాష్ట్రంలో వివిధ ప్రభుత్వ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు ఏళ్ల తరబడి వేతనాల చెల్లింపులో ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం చూపాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో ఈ ఏడాది ఏప్రిల్ నెల నుంచి నేరుగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాల్లోనే జీతాలు జమ చేయాలని నిర్ణయించింది. ఈ విప్లవాత్మక మార్పు ద్వారా మధ్యవర్తులు, ప్రైవేట్ ఏజెన్సీల దోపిడీకి అడ్డుకట్ట వేయవచ్చని భావించింది. ఇందులో భాగంగా ప్రస్తుతం రెగ్యులర్ ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు అందిస్తోన్న ఐఎఫ్ఎంఎస్ విధానం ద్వారా ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకూ పారదర్శకంగా వేతనాలు చెల్లించేందుకు ఆర్థిక శాఖ కసరత్తు చేస్తోంది. ఇందు కోసం ప్రస్తుతం ఉన్న ఐఎఫ్ఎంఎస్ పోర్టల్ లోనే ప్రత్యేక ఆప్షన్ చేర్చాలా లేదా వీరి కోసమే సరికొత్త వెబ్ పోర్టల్‌ను రూపొందించింది. ఈ విధానం అమల్లోకి వస్తే, ఏజెన్సీల ప్రమేయం లేకుండా ప్రతి నెల నిర్ణీత తేదీన ఉద్యోగుల ఖాతాల్లో నగదు జమ అవుతుంది. ఈ క్రమంలోనే ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల విద్యా, ఇతర అర్హతలపై ఆరా తీసింది. ఇందులో చాలా మంది కనీసం ఆధార్ కార్డు లేకుండా. బోగస్ సర్టిఫికెట్లు రూపొందించి అక్రమ మార్గంలో ఉద్యోగాలు సాధించినట్లు తేలింది. కాగా ఇన్నాళ్లు ప్రభుత్వం నిధులను సంబంధిత ఏజెన్సీలు లేదా శాఖాధిపతుల ఖాతాల్లో ఆయా ఉద్యోగుల వేతనాలు జమా చేసేది. దీనిని ఆసరాగా చేసుకుని కొన్ని ఏజెన్సీలు ఉద్యోగుల జీతాల్లో భారీగా కోతలు విధిస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. లేని ఉద్యోగుల పేర్లతో అక్రమంగా జీతాలు డ్రా చేస్తున్న ఉదంతాలు వెలుగులోకి వచ్చాయి. ఆధార్ అనుసంధానం తప్పనిసరి చేయడంతో ఇలాంటి బినామీల గుట్టు రట్టయింది. ప్రభుత్వం విడుదల చేస్తున్న పీఎఫ్, ఈఎస్ఐ నిధులను ఏజెన్సీలు ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకుండా పక్కదారి పట్టిస్తున్నట్లు తేలింది. కొత్త విధానంతో ఈ నిధులు నేరుగా లబ్ధిదారులకే అందుతాయి.

# ఇరాన్‌కు హ్యాండ్ ఇచ్చిన రష్యా, చైనా

**ముద్ర డెస్క్:**
అమెరికా–ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణించిన తర్వాత అంతర్జాతీయ రాజకీయాల్లో ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇరాన్‌కు అత్యంత సన్నిహిత మిత్రదేశాలుగా భావించే రష్యా, చైనా ఈ ఘటనపై తీవ్రంగా స్పందిస్తాయని ప్రపంచం భావించింది. కానీ వాస్తవ పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. ఖమేనీ హత్యను ఖండిస్తూ మాటలతోనే స్పందించిన మాస్కో, బీజింగ్ ఇరాన్‌కు ప్రత్యక్ష సైనిక సహాయం అందించేందుకు ముందుకు రాలేదు. మిత్రదేశం తీవ్ర సంక్షోభంలో ఉన్నప్పటికీ చైనా, రష్యాలు చూపుతున్న ఈ మితమైన స్పందన అంతర్జాతీయ వేదికపై చర్చనీయాంశంగా మారింది. దీంతో ఈ దేశాలతో ఉన్న వ్యూహాత్మక మైత్రి నిజంగా ఎంతవరకు ప్రయోజనకరమన్న ప్రశ్న పలు దేశాల్లో తలెత్తుతోంది.



**ఒప్పందాలు ఉన్నా.. రక్షణలో వెనుకంజ**
రష్యా, ఇరాన్‌లు గత ఏడాది జనవరిలో 20 సంవత్సరాల కాలానికి ఒక కీలక వ్యూహాత్మక ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ద్వైపాక్షిక ఆర్థిక, సైనిక, రాజకీయ సంబంధాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించుకున్నాయి. అయినప్పటికీ రక్షణ పరంగా ఇరాన్‌కు రష్యా స్పష్టమైన మద్దతు ప్రకటించకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఇజ్రాయెల్, అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై గతంలో దాడులు చేసినప్పుడు కూడా మాస్కో కేవలం ఖండనతోనే సరిపెట్టింది. టెహ్రాన్‌కు మద్దతుగా సైనిక జోక్యం చేసుకోవడంగానీ, ఆయుధాలు సమకూర్చడంగానీ చేయలేదు. తాజాగా ఖమేనీ హత్య జరిగిన తర్వాత కూడా అదే ధోరణి కొనసాగుతోంది. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఈ ఘటనను ఖండించినప్పటికీ ఇరాన్‌కు ప్రత్యక్ష సైనిక సహాయం అందించాలన్న అంశంపై మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.

**ఇతర మిత్రదేశాల విషయంలోనూ అదే పరిస్థితి**
ఇటీవలి కాలంలో రష్యా తన మిత్రదేశాలకు ప్రత్యక్షంగా అండగా నిలవలేకపోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురోను అమెరికా బలగాలు కిడ్నాప్ చేసిన ఘటనలో మాస్కో పెద్దగా స్పందించలేదు. అలాగే సిరియాలో తమకు అత్యంత అనుకూలుడైన బషర్ అల్–అసద్ ప్రభుత్వాన్ని తిరుగుబాటు దళాలు 2024 డిసెంబరులో కూల్చివేసినప్పుడు కూడా రష్యా ప్రత్యక్ష జోక్యం చేసుకోలేదు. దీంతో రష్యాతో ఉన్న మైత్రి సైనిక భద్రతకు ఎంతవరకు హామీ ఇస్తుందన్న సందేహాలు ప్రపంచ దేశాల్లో పెరుగుతున్నాయి. విశ్లేషకుల అభిప్రాయం ప్రకారం ఉక్రెయిన్‌తో జరుగుతున్న యుద్ధంలో ఇప్పటికే రష్యా తీవ్రంగా నిమగ్నమై ఉంది. అంతేకాక పాశ్చాత్య దేశాల ఆర్థిక ఆంక్షల కారణంగా మాస్కోపై భారీ ఒత్తిడి నెలకొంది. ఈ పరిస్థితుల్లో ఇతర మిత్ర దేశాలకు సైనిక సహాయం అందించడంలో రష్యా వెనుకంజ వేస్తోందని అంటున్నారు.

**చైనాదీ జాగ్రత్త ధోరణే**
ఇరాన్ నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో చైనా ఒకటి. ఇరు దేశాల మధ్య రక్షణ, వ్యూహాత్మక సంబంధాలు కూడా బలంగానే ఉన్నాయి. అయినప్పటికీ ఖమేనీ హత్యపై బీజింగ్ కూడా మితమైన స్పందనకే పరిమితమైంది. ఇరాన్‌కు మద్దతుగా నిలుస్తామని చెప్పినప్పటికీ అది ఏ రూపంలో ఉంటుందన్న విషయాన్ని స్పష్టంగా వెల్లడించలేదు. ఇరాన్‌కు అత్యాధునిక సీఎం–302 సూపర్‌సోనిక్ నౌకా విధ్వంసక క్షిపణులను విక్రయించేందుకు చైనా ఒప్పందం కుదుర్చుకుందనే వార్తలు ఇటీవల వెలువడ్డాయి. అయితే అలాంటి ఒప్పందం ఏదీ లేదని బీజింగ్ స్పష్టంచేసింది.

**అమెరికా ఒత్తిడి కారణమా?**
అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ నెల 31న బీజింగ్ పర్యటనకు వెళ్లనున్న నేపథ్యంలో చైనా మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోందని అంతర్జాతీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అమెరికాతో ఉద్రిక్తతలు పెరగకుండా ఉండాలన్న ఉద్దేశంతోనే ఖమేనీ హత్య, వెనెజువెలా అధ్యక్షుడు మదురో ఘటనలపై చైనా మితమైన స్పందన చూపుతోందని అంచనా వేస్తున్నారు.

**ప్రపంచ రాజకీయాలకు కొత్త సందేశం**
ఇరాన్ సంక్షోభ సమయంలో చైనా, రష్యా చూపిన ఈ జాగ్రత్త ధోరణి ప్రపంచ రాజకీయాల్లో కొత్త సంకేతాలను ఇస్తోంది. మిత్రదేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాలు ఉన్నప్పటికీ సంక్షోభ సమయంలో ప్రత్యక్ష సైనిక మద్దతు లభిస్తుందన్న హామీ ఉండదనే అభిప్రాయం బలపడుతోంది. ఇరాన్ పరిణామాలు అంతర్జాతీయ శక్తి సమీకరణాల్లో మార్పులకు దారి తీసే అవకాశముందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## రేషన్ కార్డుల
# తొలగింపు..!?

**(మొదటి పేజీ తరువాయి)**
కారణాలేమిటో గుర్తించాలని అధికారులను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. కేంద్రం ఆదేశాల మేరకు.. కొత్త రేషన్ కార్డుల మంజూరు విషయంలో లబ్ధిదారులకు మంజూరు పైన జిల్లాల వారీగా లెక్కలు తీస్తున్నారు. దీంతో, తాజా ప్రతిపాదనల మేరకు పెద్ద సంఖ్యలో రేషన్ కార్డులకు కోత పడే అవకాశం కనిపిస్తోంది. కాగా 2026 జనవరి నాటికి తెలంగాణలో మొత్తం రేషన్ కార్డుల (ఆహార భద్రత కార్డులు) సంఖ్య 1,04,35,848 కు చేరింది. గతేడాది కాలంలో సుమారు 14.40 లక్షలకు పైగా కొత్త కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ రేషన్ కార్డుల ద్వారా సుమారు 3.35 కోట్ల మందికి పైగా లబ్ధిదారులు సన్నబియ్యం రేషన్ సరుకులను పొందుతున్నారు.

**క్షేత్ర స్థాయి నివేదికల మేరకు నిర్ణయం**
కొన్ని ప్రాంతాల్లో ప్రభుత్వం ఇస్తున్న రేషన్ బియ్యం తీసుకొని వాటిని రూ. 10 నుంచి రూ. 20 వరకు అమ్ముకుంటున్న అంశం పైన క్షేత్ర స్థాయి నుంచి అధికారులు సమాచారం అందించారు. దీంతో ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పక్క దారి పడుతోందని అధికారులు గుర్తించారు. ప్రభుత్వం అందిస్తున్న బియ్యం పోషకాలతో ఉన్నా.. మార్కెట్ లో దొరికే సాధారణ బియ్యం వైపే మొగ్గు చూపుతున్నట్లు గుర్తించారు. దీంతో.. ప్రభుత్వం ఆరు నెలల పాటు బియ్యం తీసుకోని వారి జాబితాలను సిద్ధం చేయా లని పౌర సరఫరాల శాఖకు సూచించింది. ఈ మేరకు క్షేత్ర స్థాయి నుంచి అధికారులు నివేదికలను సిద్ధం చేస్తున్నారు. దీని ద్వారా ఆరు నెలలు రేషన్ తీసుకోని వారి కార్డులను రద్దు చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. దీని పైన పూర్తి నివేదికలు అందిన తర్వాత ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకునే అవకాశం కనిపిస్తోంది.
రేషన్ కార్డు లబ్ధిదారుల విషయంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాబోయే వేసవి కాలం దృష్ట్యా ఒకేసారి మూడు నెలల సరిపడా రేషన్ బియ్యం లబ్ధిదారులకు పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఏప్రిల్, మే, జూన్ ఈ మూడు నెలలకు సంబంధించిన బియ్యం ఏప్రిల్ నెలలోనే పంపిణీ జరిగేలా చూడాలని రాష్ట్రాలకు కేంద్ర పౌర సరఫరాల శాఖ లేఖలు రాసింది. మార్చి మొదటి వారంలోనే ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు భారీగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో రాబోయే ఎండలను దృష్టిలో ఉంచుకుని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తీసుకుంది. ఇదీలావుంటే.. దేశవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రంలోనే రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. ఒక్కో లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల చొప్పున సన్నబియ్యం తెలంగాణ ప్రభుత్వం పంపిణీ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో ఫుడ్ సెక్యూరిటీ కార్డుల సంఖ్య పెరిగింది. దాదాపు కోటికి పైగా కార్డులు ఉన్నాయి. ఒకేసారి మూడు నెలలకు సరిపడా కోటా ఇవ్వాలని కేంద్రం సూచించడంతో ఆ మేరకు సరిపడా బియ్యం కోటా నిలువలు, సాధ్యాసాధ్యాలను తెలంగాణ ప్రభుత్వం పరిశీలిస్తోంది.

**బియ్యం నిల్వ ఎలా...?**
ఒకేసారి మూడు నెలల కోటా పంపిణీ చేయాలని కేంద్రం యోచిస్తుండగా గత అనుభవాల దృష్ట్యా అనేక సమస్యలు సైతం ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి. గతేడాది వర్షాకాలంలో ఒకే దఫా మూడు నెలల కోటాను పంపిణీ చేశారు. ఆ సమయంలో ఇటు లబ్ధిదారులు, రేషన్ డీలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మూడు నెలల బియ్యం కోటా ఒకేసారి పంపిణీ చేయడం ద్వారా రవాణా ఛార్జీల ఖర్చు తగ్గనుండటంతోపాటు.. డీలర్లు, హమాలీ కూలీ కలిసొచ్చే అవకాశముంది. కానీ ఆ బియ్యం నిల్వ చేసే సామర్థ్యం లేకపోవడంతో అది డీలర్లకు సమస్యగా మారింది. ఇక మూడు నెలలకు సంబంధించి మూడు ఒక్కో కార్డుదారుడు 3 సార్లు వేలి ముద్ర (థంబ్) వేయాల్సి ఉంది. దీనికి తోడు సర్వస్ సమస్యలతో ఒక్కో కార్డుకు దాదాపు 15–20 నిమిషాల సమయం పట్టే అవకాశం ఉంది. ఈ సమస్యలను అధికారులు పరిష్కరించాల్సి ఉంది.



# రూ.2కే కిలో టమాటా
## రైతు పరిస్థితి ఘోరం

**ముద్ర డెస్క్ :**
ఎవరికైనా రెండు రూపాయలు బిక్షం వేస్తే చాలా అవమానకరంగా చూస్తుంటారు. అందుకే చేతిలో కనీసం ఐదు రూపాయలు ఉంటే కానీ బిక్షం వేయలేని రోజులు ఇవి. అటువంటిది కిలో టమాట అమ్ముతున్న రైతు చేతిలో రెండు రూపాయలు పెడుతున్నారు. ఇంతకంటే అవమానం ఏమి ఉంటుంది? అసలు రెండు రూపాయలతో ఏ వస్తువైనా దొరుకుతుందా? కానీ కిలో టమాటాకు రెండు రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో టమాటా రైతుకు ఏం చేయాలో పాలుపోవడం లేదు. రెండు తెలుగు రాష్ట్రాల్లో టమాటా రైతుల పరిస్థితి కూడా ఇదే.

**ధరల స్థిరీకరణ లేదు..**
రైతులు గణనీయంగా పండించినప్పుడు వ్యవసాయ ఉత్పత్తులకు మద్దతు ధర ఉండడం లేదు. రైతు దగ్గర పంట లేనప్పుడు వాటికి ధర విపరీతంగా ఉంది. ఇప్పుడు టమాటా పరిస్థితి కూడా అదే. గత ఏడాది అక్టోబర్ నవంబర్లో 60రూపాయలకు పైగా కిలో టమాట ఉండేది. దీంతో రైతులు టమాటాకు స్థిరీకరణ ఉంటుందని భావించి గణనీయంగా సాగు చేశారు తెలుగు రాష్ట్రాల్లో. కానీ ఇప్పుడు కిలో టమాట రెండు రూపాయలు కూడా పలకడం లేదు. కనీసం కూలీల డబ్బులు రావడం లేదు. మార్కెట్కు తీసుకెళ్తామంటే రవాణా చార్జీలు కూడా రావడం లేదు. దీంతో రైతులు పొలాల్లోనే పంటను కోయకుండా విడిచిపెడుతున్నారు. కోసిన పంటను మార్కెట్కు తరలించకుండా రోడ్ల పక్కన పారబోస్తున్నారు. టమాటా రైతు పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇప్పుడు ఇదే పరిస్థితి ఉంది.

**టమాటా లేనిదే లేదు..**
టమాటా( tomato )లేని ఆహార పదార్థం లేదు. అస్సలు టమాటా లేని వంట లేదు. అంతలా తిరిగింది దాని వినియోగం. ధర ఎంత ఉన్నా ప్రతి ఒక్కరూ కొనుగోలు చేస్తుంటారు. అయితే టమాటా వినియోగం పెరగడంతో రైతులు కూడా విస్తృతంగా సాగు చేయడం ప్రారంభించారు. అయితే ధర ఉన్నప్పుడు పంట ఉండడం లేదు. పంట పండినప్పుడు ధర ఉండడం లేదు. గత ఏడాది అక్టోబర్, నవంబర్లో తీవ్ర వర్షాల నేపథ్యంలో టమాటా ధర అమాంతం పెరిగింది. 60 రూపాయల నుంచి 100 రూపాయల వరకు కిలో టమాట పలికింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి టమాటా సరఫరా ఆగిపోవడం. తెలుగు రాష్ట్రాల్లో టమాటా పండక పోవడం వంటి కారణాలతో ధర విపరీతంగా పెరిగింది. అయితే గత అనుభవాల దృష్ట్యా రబీలో భాగంగా తెలంగాణతో పాటు ఏపీలోని చిత్తూరు, కర్నూలు, పార్వతీపురం మన్యం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో టమాటాను విస్తారంగా సాగు చేసారు రైతులు. ప్రస్తుతం పంట దిగుబడి వస్తోంది. సాధారణంగా ఎకరా సాగు చేస్తే 15 క్వింటాల వరకు దిగుబడులు వస్తుంటాయి. కానీ ఈసారి మాత్రం 20 టన్నుల వరకు దిగుబడి వచ్చింది. కానీ పంట ఉత్పత్తి పెరగడంతో ధర తగ్గుముఖం పట్టింది. కేవలం రెండు రూపాయలు కిలో పలుకుతోంది. ఇది ఎంత మాత్రం రైతులకు గిట్టుబాటు కలగడం లేదు.

**పెట్టుబడి, శ్రమ అధికం**
సాధారణంగా ఎకరా టమాటా సాగుకు దాదాపు 30 వేల రూపాయల వరకు ఖర్చు అవుతుంది. కానీ ఇప్పుడు కిలో టమాటా కేవలం రెండు రూపాయలు మాత్రమే. కనీసం పళ్ళను సేకరించి కూలీలకు ఇచ్చే వేతనానికి కూడా సరిపడదు. మార్కెట్కు తరలిస్తే రవాణా చార్జీలు కూడా రావడం లేదు. దీంతో ఏం చేయాలో టమాటా రైతుకు పాలుపోవడం లేదు. ఉత్తరాంధ్రలో అతిపెద్ద మార్కెట్ గా పేరుపొందింది రామభద్రపురం. విజయనగరం జిల్లాలోని రామభద్రపురం మార్కెట్లో ప్రస్తుతం ఎటుచూడు టమాటా కనిపిస్తోంది. ఇంకోవైపు పొలంలోనే టమాటా కోత కోయకుండా విడిచి పెడుతున్న రైతులు ఉన్నారు. పోసిన పంటను లేకుండా రోడ్ల పక్కన పారబోస్తున్న వారు ఉన్నారు. అంతలా దయనీయ పరిస్థితికి చేరింది టమాట రైతు పరిస్థితి.

**విస్తారంగా సాగు..**
గతంలో మదనపల్లె, చిత్తూరు, కర్నూలు జిల్లాల్లో ఎక్కువగా టమాటాను పండించే వారు. కానీ ఒక్కోసారి టమాటా ధర పెరిగి రైతుకు బాగానే గిట్టుబాటు అవుతుంది. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా మెట్ట ప్రాంతాల్లో రైతులు టమాట సాగు చేయడం ప్రారంభించారు. అయితే శ్రమ ఎక్కువ ఫలితం తక్కువ అన్నట్టు ఉంది టమోటా రైతు పరిస్థితి. ధర స్థిరీకరణ లేదు. పంట చేతికొచ్చే వరకు గ్యారెంటీ ఉండదు. తీరా చేతికి వచ్చిన సమయానికి ధర ఉండడం లేదు. దీంతో ఒక్కసారి టమాటా సాగు చేసిన రైతులు మరోసారి దాని జోలికి పోవడం లేదు. ఒక టీ తాగితే పది రూపాయలు ఖర్చు అవుతోంది. కానీ అదే పది రూపాయలతో ఐదు కేజీల టమాటా లభిస్తుంది అంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. టమాటా రైతు పరిస్థితి ఏ స్థాయికి దిగజారిందో ఊహించుకోవచ్చు.



## తెలంగాణ సన్నబియ్యం.. ఆంధ్రాకు
# ఇదో పెద్ద స్కాం!

**ముద్ర డెస్క్ :**
ఏపీలో రేషన్ బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడడం లేదు. నిత్యం ఏదో ఒక చోట రేషన్ బియ్యం పట్టుపడుతూనే ఉంది. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నో విధాలుగా కట్టడి చేసే ప్రయత్నం చేసింది. కానీ అడ్డుకట్ట పడడమే లేదు. ముఖ్యంగా కాకినాడ పోర్టు ద్వారా పెద్ద ఎత్తున రేషన్ బియ్యం తరలిపోతుందన్న ఆరోపణలు నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. అందుకు తగ్గట్టుగానే భారీ షిప్ పై తరలిపోతున్న రేషన్ బియ్యం పట్టుబడింది. అప్పటినుంచి కాకినాడ పోర్ట్ పై ప్రత్యేక నిఘా ఉంది. అయితే ఆ పోర్టుపై రేషన్ బియ్యం తరలింపు ఆగిన రాష్ట్రవ్యాప్తంగా ప్రతి జిల్లాలో రేషన్ బియ్యం రవాణా కొనసాగుతూనే ఉంది.

**కట్టడి చర్యలు చేపట్టినా..**
రేషన్ బియ్యం విషయంలో ప్రభుత్వం కఠిన చర్యలకు దిగుతూ వచ్చింది. తనిఖీలను ముమ్మరం చేసింది. అయినా సరే కట్టడి జరగడం లేదు. కొంత మంది మిల్లర్లు, వ్యాపారులు కుమ్మక్కై ఈ దందాకు పాల్పడుతున్నారని స్పష్టమవుతోంది. గ్రామాల్లో కమిషన్ ఏజెంట్లను నియమించుకొని.. ప్రజలు రేషన్ బియ్యం విడిపించిన వెంటనే ఆ బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. అదే బియ్యాన్ని కమీషన్ ప్రాతిపదికన మిల్లర్లకు విక్రయిస్తున్నారు. అదే బియ్యం రీ పాలిష్ చేసి లెవీకి పంపుతున్నారు. అదే బియ్యాన్ని మళ్లీ రేషన్ బియ్యంగా మార్చేస్తున్నారు. ఈ దందా కొనసాగుతూనే ఉంది. అయితే తెలంగాణ బియ్యం ఏపీకి.. ఏపీ బియ్యం తెలంగాణకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తాజాగా తెలంగాణ నుంచి ఏపీకి తరలిస్తున్న బియ్యం నల్గొండ జిల్లాలో పట్టుబడింది.

**రూటు మార్చిన అక్రమార్కులు..**
ఇప్పటివరకు ఇతర ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము చేసుకున్నారు అక్రమార్కులు. కానీ ఇప్పుడు తెలంగాణ నుంచి ఏపీకి బియ్యం తీసుకొచ్చి చలామణి చేస్తున్నారు. సన్న బియ్యం పేరిట విక్రయాలు చేసి సొమ్ము చేసుకుంటున్నారు. వినియోగదారులు రేషన్ విడిపించిన వెంటనే వారి నుంచి 15 రూపాయలకు కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసినందుకు గాను మధ్య భక్తులకు మిల్లర్లు, వ్యాపారులు కిలో దగ్గర నాలుగు రూపాయలు అందిస్తున్నారు. అదే బియ్యాన్ని ఏపీలో 25 రూపాయలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. అంటే కిలో దగ్గర పది రూపాయలు దోపిడీ కొనసాగుతోందన్నమాట. నల్గొండ జిల్లా మిర్యాలగూడలో పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుబడడంతో అసలు విషయం బయటకు వచ్చింది. గత కొద్దిరోజులుగా ఈ దందా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎక్కడికక్కడే తనిఖీల ద్వారా ఈ రేషన్ బియ్యం రవాణా కు చెక్ పెట్టేందుకు రెండు రాష్ట్రాల అధికారులు రంగంలోకి దిగినట్లు తెలుస్తోంది. విస్తృత తనిఖీలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తానికి అయితే బియ్యం రవాణా కట్టడికి రెండు రాష్ట్ర ప్రభుత్వాలు రంగంలోకి దిగడం విశేషం.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ఇరాన్ చరిత్ర

**అలెగ్జాండర్ దండయాత్ర (క్రి.పూ. 330)**



మేసిడోనియా రాజు అలెగ్జాండర్ పర్షియన్ సామ్రాజ్యాన్ని జయించి ఇరాన్‌ను తన ఆధీనంలోకి తీసుకున్నాడు. దీంతో గ్రీకు సంస్కృతి పర్షియన్ సంస్కృతితో కలిసింది.

## రాహుల్ ను ప్రధానిగా చూడాలనుకోవడం మా హక్కు

- కేంద్రమంత్రి బండి సంజయ్ కు పొన్నం కౌంటర్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



రాహుల్ గాంధీని ప్రధానమంత్రిగా చూడాలని ఆశించడం ఒక రాజకీయ పార్టీగా తమహక్కు అని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో నాయకత్వం ఎవరికి దక్కాలో నిర్ణయించేది ప్రజలేనన్నారు. అంతే తప్ప బండి సంజయ్.. లేదా మరో వ్యక్తి కాదన్నారు. దేశం కోసం ప్రధానమంత్రిని అవుతానని రాహుల్ గాంధీచేసిన వ్యాఖ్యలపై స్పందించిన బండి సంజయ్.. రాహుల్ పీఎం సీటుపై ఆశలు వదులుకోవాల్సిందేనంటూ సెటైర్లు వేశారు. దీనిపై మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం ప్రకటనలో కౌంటర్ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో పదవులు శాశ్వతం కావన్న పొన్నం.. అవి ప్రజల విశ్వాసంపై ఆధారపడి ఉంటాయని చెప్పారు. ఈ దేశానికి పట్టిన గ్రహణం ఎవరో ప్రజలకు తెలుసన్నారు. బీజేపీ పాలనలో గత 12 ఏళ్లుగా ప్రజలు ఎన్నో కష్టాలు అనుభవిస్తున్నారన్నారు. పీఎం నరేంద్రమోడీ దేశాన్ని కార్పొరేట్లకు కట్టబెట్టి తమాషా చూస్తున్నారనీ ఆరోపించారు. దేశ సార్వభౌమత్వాన్ని అమెరికాకు తాకట్టు పెట్టిన మీరా మాట్లాడేది..? అని నిలదీశారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత పరిపాలన వ్యవస్థలు అస్తవ్యస్థంగా మారాయనీ ప్రభుత్వ రంగ సంస్థలు తెగనమ్ముతున్నారని ఆరోపించారు. విద్వేషాన్ని రెచ్చగొట్టి మైనార్టీ లను అణగారిన వర్గాలను బూచిగా చూపి బీజేపీ అధికారాన్ని చెలాయిస్తోందన్నారు. నిత్యం మతవిద్వేశాలు రెచ్చగొడుతూ రాజకీయం చేస్తోందని మండిపడ్డారు. కేంద్ర దర్యాప్తు సంస్థలను ఈడి సీబీఐ కేసులతో విపక్ష ప్రభుత్వాలను కూలుస్తు ప్రజాస్వామ్యాన్ని కూని చేస్తున్న రాజకీయం మీదేనని ధ్వజమెత్తారు.

# సింగూర్ భద్రతకు తొలి ప్రాధాన్యత

- ప్రాజెక్టుల భూసేకరణకు రూ.5వేల కోట్లు
- జూన్ 2 నాటికి అన్ని ప్రాజెక్టుల భూసేకరణ పూర్తి
- సింగూర్ పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీపడం
- పాలెం వాగు ప్రాజెక్ట్ గేట్లు,రెగ్యులేటర్ సమస్యలను పరిష్కరిస్తా..
- ప్రాజెక్ట్ పరిస్థితిని క్షేత్రస్థాయిలో వెళ్లి సమీక్షించండి
- ఇరిగేషన్ అధికారులకు మంత్రి ఉత్తమ్ ఆదేశాలు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్ర వ్యాప్తంగా నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.5వేల కోట్ల నిధులు విడుదల చేయనున్నట్లు రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. ఈ ఏడాది జూన్ 2 వరకు భూసేకరణ పూర్తి చేసి... నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రధానంగా హైరాబాద్ మహానగరానికి ప్రాణాధారంగా నిలిచిన సింగూర్ ప్రాజెక్టు పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటుందనిమంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. సింగూర్ డ్యామ్ భద్రత తమ ప్రభుత్వానికి అత్యున్నత ప్రాధాన్యమన్న ఆయన మంత్రి.. స్వయంగా తాను సింగూర్ ప్రాజెక్టును సందర్శించి పరిస్థితిని పూర్తిస్థాయిలో సమీక్షిస్తానని ప్రకటించారు. బుధవారం ఉదయం సహచర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సితక్క, వివేక్ వెంకటస్వామి లతో కలిసి రాష్ట్ర సచివాలయంలో ఆయన నీటిపారుదల శాఖా ఇంజినీర్లతో ఉన్నత స్థాయిలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ జంటనగరాలకు తాగునీటిని సరఫరా చేస్తూ, పరిసర ప్రాంతాలకు సాగునీరూ అందిస్తున్న సింగూర్ ప్రాజెక్టును పరిరక్షించడంతో పాటు పునరుద్ధరణ విషయంలో ఎటువంటి రాజీ ఉండబోదని ఆయన స్పష్టం చేశారు. జాతీయ ఆనకట్ట భద్రతా సంస్థతో పాటు, రాష్ట్ర అధికారుల నుంచి భద్రతా పరిస్థితిపై హెచ్చరికలు వచ్చాయన్నారు. ప్రమాదాలను నివారించేందుకు తక్షణ సాంకేతిక జోక్యాలు, నీటిమట్టం దిగువన అండర్‌వాటర్ పరిశీలనలు, మరమ్మత్తు పనులను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సంగారెడ్డి జిల్లాలో ఉన్న సింగూర్ డ్యామ్ (ఎం. బాగా రెడ్డి సింగూర్ ప్రాజెక్టు)పై 2025 మధ్య కాలం నుండే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు. ఆ సమయంలో నిర్వహించిన అంచనాల్లో ఎంబాంక్మెంట్‌లో చీలికలు, స్లోప్ ఎరోషన్, రివెట్‌మెంట్ నష్టం, ప్లంజ్ పూల్ సమస్యలు వెలుగులోకి వచ్చాయన్నారు. ఇవి దిగువ ప్రాంతాల్లో వరద ముప్పుకు దారితీసే అవకాశాలపై ఆందోళనలు రేకెత్తించాయని చెప్పారు. 29.91 టీఎంసీల స్థూల సామర్థ్యం ఉన్న ఈ రిజర్వాయర్ ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు 6-7 టీఎంసీల నీటిని సరఫరా చేస్తోందని ఆయన తెలిపారు. బండ్ దిగువన నీటిని పూర్తిగా వదలకుండా దాగి ఉన్న నష్టాలను గుర్తించేందుకు సోనార్ పరీక్షలు, అండర్‌వాటర్ సర్వేలు చేపట్టి 2-3 రోజుల్లో నివేదిక సమర్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. త్వరలోనే స్వయంగా ఆనకట్టను సందర్శిస్తానని ప్రకటించిన ఆయన, ఒకే సీజన్‌లో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు, పంటల విరామం రాకుండా చూడాలన్నారు. ఇదే సమయంలో సింగూర్ కాలువ లైనింగ్ పనుల పురోగతిని కూడా మంత్రి సమీక్షించారు. మొత్తం 13 కి.మీ.లో 9 కి.మీ. పూర్తయ్యాయి; మిగిలిన 4 కి.మీ.ను అత్యవసరంగా పూర్తి చేయాలని ఆదేశించారు. 2025 ఆగస్టులో నిల్వలను భద్ర పరిమితులకు కట్టడి చేసి, నియంత్రిత నీటి విడుదలలు ప్రారంభించినప్పుడు ఆనకట్టపై ముప్పు స్థాయి పెరిగిందనీ డిసెంబర్ నాటికి దశలవారీగా నీటిమట్టాన్ని తగ్గించి ప్రధాన మరమ్మత్తులు చేపట్టినట్లు మంత్రి వివరించారు. ములుగు జిల్లాలో నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. పాలెం వాగు గేట్లు,రెగ్యులేటర్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. పాలెంవాగు పరిస్థితిని క్షేత్రస్థాయిలో పర్యటించి పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి నివేదికను సమర్పించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



## జైల్లో టార్చర్ పెట్టారు

- హోలీ పండుగకు, కుమారుడి పుట్టిన రోజుకు దూరం చేశారు.
- ఆవేదన వ్యక్తం చేసిన బాల్క సుమన్

**ముద్ర మందమర్రి:**

క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల సందర్భంగా మంత్రి వివేక్ తనను అనేక రకాలుగా వేధింపులకు గురిచేశారని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ అన్నారు. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే తనను అంతమొందిస్తారేమోనని అనుమానంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. జైలు నుంచి విడుదలై వచ్చిన తర్వాత మంచిర్యాల జిల్లా క్యాతనపల్లిలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. 'జైల్లో తనను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారని, మంచినీళ్లు కూడా సరిగా ఇవ్వలేదని ఆరోపించారు. భోజనం సరిగ్గా పెట్టలేదని, జ్వరం వచ్చినా.. సరైన వైద్యం అందించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జైలు నుంచి బయటకు రాకుండా అనేక కుట్రలు చేశారని సుమన్ తీవ్రంగా ఆరోపించారు.

## ప్రతిపక్షాల ఆరోపణలు అర్థరహితం

- ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



విద్యా కమిషన్‌పై తెలిసి తెలియక ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని ప్రభుత్వ సలహాదారు కే.కేశవరావు అన్నారు. చాలా మందిని సంప్రదించాకే కమిషన్ రిపోర్టు తయారు చేసిందని అన్నారు. విద్యాకమిషన్ కమిషన్ ఇచ్చిన నివేదికను అమల్లోకి తీసుకొస్తామన్నారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. విద్యా కమిషన్ నివేదికపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలకు కౌంటర్ ఇచ్చారు. టీచర్ల జీతాలవివాదంపై స్పందిస్తూ సమాజంలోని విద్యార్థులు దారిప్పిపోకుండా వారిని ప్రయోజకులను చేస్తున్న ఉపాధ్యాయుల సేవలకు విలువ కట్టలేమని అన్నారు. ఉపాధ్యాయుల జీతాల అంశాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. విద్యా కమిషన్‌లో అసలైన విద్యావేత్తలు ఉన్నారా? సూల్, కాలేజీ లేదా యూనివర్సిటీ స్థాయిలో బేసిక్ పాఠాలు చెప్పిన అనుభవం ఉన్న విద్యావేత్త ఒక్కరైనా ఉన్నారని చెప్పగలరా? అని ప్రతిపక్షాలు చేసిన విమర్శలను కేశవరావు ఖండించారు. కమిషన్ లో విద్యావేత్తలు ఎందుకు లేరని ప్రశ్నించారు. కాగా ఆకునూరి మురళి కమిషన్ ప్రభుత్వానికి సమర్పించి సిఫార్సుల్లో టీచర్లు, అధ్యాపకుల జీతాల అంశం వివాదాస్పదం అయింది. టీచర్లు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది వేతనాలు అధికంగా ఉన్నాయని, వీటిని రాబోయే రోజుల్లో హేతుబద్ధీకరించాలని కమిషన్ అభిప్రాయపడింది. ఈ సిఫార్సుపై ప్రతిపక్షాలు, ఉపాధ్యాయ సంఘాలు తీవ్రంగా మండిపడుతున్నాయి. ఈ అంశంలో ప్రభుత్వంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఈ నేపథ్యంలో తాజాగా స్పందించిన కేశవరావు జీతాల అంశాన్ని తప్పుగా అర్థం చేసుకుంటున్నారని అన్నారు.



## నితీష్ కుమార్ రాజీనామా?

- బిహార్ రాజకీయాల్లో ఒక్కసారిగా మారిన పరిణామాలు

**ముద్ర డెస్క్ :**

బిహార్ రాజకీయాల్లో పెను సంచలనం జరగనుందా అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ తన పదవికి రాజీనామా చేసే అవకాశం ఉందని సమాచారం అందుతుంది. బీజేపీకి ముఖ్యమంత్రి స్థానం కట్టబెట్టి నితీశ్ కుమారునికి ఉప ముఖ్యమంత్రి పదవి ఇచ్చేలా బీజేపీతో ఒప్పందం కుదిరినట్లు తెలుస్తోంది. బిహార్ రాజకీయ పరిణామాలు ఒక్కసారిగా మారాయి. నిన్నటి వరకూ నితీష్ కుమార్ కుమారుడు.. నిశాంత్ కుమార్ ప్రత్యక్ష రాజకీయాలలోకి వస్తున్నారని ఆయన కోసం రాజ్యసభ సీటు సైతం కేటాయించారని జేడీయూ సీనియర్ నేత శ్రవణ్ కుమార్ తెలిపారు. దీంతో నితీష్ కుమార్ వారసుడి ఎంట్రీ ఖరారైందని అంతా భావించారు. అంతలోనే ఊహించని ట్విస్ట్ జరిగింది. నితీష్ కుమార్ ముఖ్యమంత్రిగా రాజీనామా చేసి రాజ్యసభకు వెళ్లనున్నట్లు సమాచారం అందుతుంది. దీనికోసం ఢిల్లీలో ఒప్పంద కూడా జరిగిందని జేడీయూ కీలక నేత చెప్పినట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇది చాలా బాధపడాల్సిన సమయం అని అంతా ఢిల్లీలోనే జరిగిందని ఆయన ఆ నేత తెలిపినట్లు ప్రచురించాయి. అయితే నితీష్ కుమార్‌ని వచ్చే రాజ్యసభ ఎన్నికల్లో నామినేట్ చేయనున్నారని ప్రచారం నడుస్తోంది. ఆయన స్థానంలో నితీష్ కుమారుడు నిశాంత్ కుమార్‌కు ఉప ముఖ్యమంత్రి పదవి కట్టబెట్టే అవకాశాలున్నట్లు తెలుస్తుంది.

## వాట్సప్‌లో హాల్‌టికెట్లు

- ఏపీలో మార్చి 16 నుంచి టెన్త్ పరీక్షలు

**ముద్ర, అమరావతి:**

ఏపీలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మార్చి 16 నుంచి ప్రారంభం కానుండటంతో విద్యార్థులంతా హాల్‌టికెట్ల కోసం ఎదురు చూస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారులు బుధవారం సాయంత్రం కీలక అప్‌డేట్ ఇచ్చారు. పదో తరగతి పరీక్షల హాల్‌టికెట్లను ఈ నెల 5న ఉదయం 11 గంటలకు విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి బుధవారం సాయంత్రం ఓ ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు తమ హాల్‌టికెట్లను బోర్డు ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ అధికారిక వెబ్‌సైట్ https://www.bse.ap.gov.in/తో పాటు మనమిత్ర (వాట్సప్ నంబరు 9552300009) లేదా లీప్ యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే, సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల వద్ద కూడా హాల్‌టికెట్లను పొందవచ్చని సూచించారు.

**డౌన్‌లోడ్ ఇలా..**

మీ ఫోన్‌లో 95523 00009 నంబర్‌ను సేవ్ చేసుకోండి
అందులో Hi అని మెసేజ్ పంపండి
సర్వీస్ సెలక్షన్ అనే ఆప్షన్ వస్తుంది
ఎడ్యుకేషన్ సర్వీసెస్‌ను ఎంచుకోండి
అక్కడ ఎస్ఎస్‌సీ హాల్‌టికెట్ అనే ఆప్షన్‌ను సెలక్ట్ చేసుకోండి
అప్లికేషన్ నంబర్/చైల్డ్ ఐడీతో పాటు పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేయాలి.
రెగ్యులర్/ప్రైవేటు/ఓఎస్ఎస్‌సీ రెగ్యులర్/ఒకేషనల్‌లలో మీకు సంబంధించిన కేటగిరీని ఎంచుకొని కన్‌ఫర్మ్ చేయండి.
ఆ తర్వాత కొద్ది నిమిషాలకు హాల్‌టికెట్ మీ వాట్సప్ నంబర్‌కే వచ్చేస్తుంది.
డౌన్‌లోడ్ చేసుకొని ప్రింట్ తీసి భద్రపరుచుకోండి.

## కల్తీ నెయ్యి పట్టివేత

**ముద్ర, హైదరాబాద్:**




బంజారాహిల్స్‌లో భారీగా కల్తీ నెయ్యిని టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మాసబ్ ట్యాంక్ పోలీసులతో కలిసి బంజారాహిల్స్ రోడ్ నం 12లో గోల్కొండ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోదాలు చేపట్టారు. ఫ్రైడ్ డెయిరీ పేరుతో నిర్వహిస్తున్న కల్తీ నెయ్యి కేంద్రంలో తనిఖీలు చేపట్టి.. రూ.18.26 లక్షల విలువ చేసే 460 కిలోల కల్తీ నెయ్యి, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మహ్మద్ జునైద్‌ను అరెస్ట్ చేశారు. కల్తీ నెయ్యిని పలు హోటళ్లకు, శుభకార్యాలకు నిందితుడు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి మాసబ్ ట్యాంక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# యుద్ధాల కొత్త యుగం..

- డ్రోన్లే అసలైన ఆయుధం!
- అమెరికా, ఇరాన్ గగనతలంలో ఆధిపత్య పోరు
- స్వదేశీ టెక్నాలజీపై దృష్టి
- భారత్ అభివృద్ధి చేస్తున్న 'శేష్ నాగ్-150'
- 1000 కిలోమీటర్ల దూరంలో లక్ష్యాలను చేధించే సామర్థ్యం

**ముద్ర డెస్క్ :**



వెనకటి కాలంలో యుద్ధాలు జరిగినప్పుడు యుద్ధ విమానాలు కీలక పాత్ర పోషించేవి.. భారీగా మందు గుండు సామాగ్రి వాడేవారు.. అత్యంత బరువు ఉన్న బాంబులను వినియోగించేవారు.. విపరీతమైన పేలుడు సామర్థ్యం ఉన్న బాంబర్ల ను వాడేవారు.. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత.. బాంబులవాడకంలో ప్రపంచ దేశాల తీరు మారింది. అమెరికా ఆయుధ వ్యాపారం మొదలు పెట్టిన తర్వాత బాంబుల తయారీ సరికొత్త దశ మొదలైంది అని చెప్పవచ్చు. యుద్ధ విమానాలను అమెరికా తయారు చేయడం మొదలుపెట్టింది. వాటిని ప్రపంచ దేశాలు కొనుగోలు చేసే విధంగా ఒత్తిడి తీసుకురావడం ప్రారంభించింది. ఏదో ఒక రూపంలో ప్రపంచ దేశాల మీద ఒత్తిడి లేదా ఆంక్షలు విధించడంతో అమెరికా ఆయుధ వ్యాపారం జోరుగా సాగింది.

**ఇతర దేశాల తయారీతో..**

ఇతర దేశాలు కూడా యుద్ధ సామగ్రి తయారు చేయడం మొదలు పెట్టాయి. యుద్ధ విమానాలు.. యుద్ధ సామగ్రిని భారీగా తయారుచేశాయి. యుద్ధకాంక్షతో రగిలిపోయే దేశాలు వీటిని కొనుగోలు చేయడం మొదలుపెట్టాయి. అయితే ఇలా యుద్ధ సామగ్రిని కొనుగోలు చేయడం వాటిని అమ్మే దేశాలకు భారీగా నగదును అందిస్తే.. కొనుగోలు చేసే దేశాల మీద తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిని తీసుకొచ్చాయి. యుద్ధం చేసే తీరు కూడా మారిపోయింది. అందువల్లే కొన్ని దేశాలు అత్యాధునిక ఆయుధ సామాగ్రిని రూపొందించుకోవడం మొదలుపెట్టాయి. ఇందులో భాగంగానే అత్యాధునిక మిసైల్స్.. యుద్ధ విమానాలను తయారుచేస్తున్నాయి. ఇటీవల కాలంలో జరిగిన యుద్ధాలను పరిశీలిస్తే డ్రోన్ల వాడకం పెరిగిపోయింది.

**భారత్ చేతిలో..**

ఇరాన్, అమెరికాలో సొంత డ్రోన్లతో గగనతలంలో విన్యాసాలు చేస్తున్న వేళ.. భారత్ పరిస్థితి ఏంటి అనే చర్చ కూడా మొదలైంది. అయితే ఈ నేపథ్యంలోనే రక్షణ రంగ నిపుణులు తెరపైకి ఒక ఆసక్తికరమైన విషయాన్ని తీసుకొచ్చారు. అమెరికా, ఇరాన్ మాదిరిగానే భారత్ సొంత డ్రోన్ రూపొందించుకుంది. దీని పేరు శేష్ నాగ్ 150. బెంగళూరులోని ఎన్ఆర్టి సంస్థ దీనిని అభివృద్ధి చేస్తోంది. ఈ డ్రోన్ 25 నుంచి 40 కిలోల ఆయుధాలతో దాదాపు 1000 కిలోమీటర్ల దూరంలో ఉన్న టార్గెట్స్ ను రీచ్ అవుతుంది. జిపిఎస్ సిగ్నల్ లేని చోట కూడా విజువల్ నావిగేషన్ ద్వారా ఇది పనిచేస్తుంది. యుద్ధక్షేత్రంలో సొంత ఇంటెలిజెన్స్ సహాయంతో నిర్ణయాలు తీసుకుంటుంది. దగ్గర్లో ఉన్న ఇతర డ్రోన్లతో ఇది కమ్యూనికేట్ చేసుకుంటుంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
05.03.2026 గురువారం, హైదరాబాద్




మీ 'ముద్ర' వేయండి

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# శ్రమయేవ జయతే...!


మనందరికీ సినిమాల ద్వారా పరిచయమైన వ్యక్తి బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్. బాలీవుడ్‌లో ఎలాంటి వారసత్వం లేకుండా స్వయం కృషితో వేల కోట్ల సంపదను సంపాదించిన అరుదైన నటుడు. రాత్రికి రాత్రే అతనికి అదృష్టం వరించలేదు. సినిమాల్లో నటించాలనే కోరికే అతన్ని ఈ స్థాయికి తీసుకువచ్చింది. మొదట టీవీ సీరియల్స్‌లో నటించి, 1992లో వచ్చిన "దివానా" సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టాడు. క్రమంగా తన ప్రతిభతో ఎదిగి నేడు ప్రపంచంలోనే ధనిక నటుల్లో ఒకరిగా గుర్తింపు పొందాడు. 13 ఫిల్మ్‌ఫేర్ అవార్డులు, పద్మశ్రీ (2005), ఫ్రాన్స్ ప్రభుత్వ Order of Arts and Letters (2007), Legion of Honour (2014) వంటి అనేక గౌరవాలు అందుకున్నాడు. అంతేకాదు సుమారు 400 మంది యాసిడ్ బాధితులకు సహాయం చేస్తూ సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తిస్తున్నాడు. ఒకప్పుడు సరిగా ఇల్లు కూడా లేని పరిస్థితిలో ఉన్న షారుఖ్ ఖాన్, నేడు ముంబాయిలోని తన ఇంటి "మన్నత్" ద్వారా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. దాని విలువ సుమారు 200 కోట్లకు పైగా ఉంటుందని అంచనా. బుర్జ్ ఖలీఫా వద్ద, ఐఫిల్ టవర్ వద్ద ఫోటో దిగాలనుకునే పర్యాటకులు ఎంత ఉత్సాహంగా ఉంటారో, మన్నత్ ముందు ఫోటో దిగడానికి కూడా అంతే ఆసక్తి చూపుతారు. షారుఖ్ ఖాన్ విజయానికి కారణం కేవలం నటన మాత్రమే కాదు, అతని వ్యాపార దూరదృష్టి కూడా. సినిమాల నిర్మాణానికి అప్పులు చేయడం తనకు ఇష్టం లేదని చెబుతాడు. అందుకే తాను చేసే యాడ్స్ ద్వారా అడ్వాన్స్‌గా వచ్చిన డబ్బులతోనే సినిమాలకు పెట్టుబడి పెట్టడం అతని వ్యూహం. సినిమా హిట్ అయితే లాభం వస్తుంది, ఫ్లాప్ అయితే అప్పు భారముండదు.



మొదట "Dreams Unlimited" అనే సంస్థ ద్వారా సినిమాలు నిర్మించినా అవి ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు. తర్వాత తన భార్య గౌరీ ఖాన్‌తో కలిసి రెడ్ చిల్లీస్ ఎంటర్ టైన్ మెంట్ ప్రారంభించాడు. ఈ సంస్థ ద్వారా సినిమా నిర్మాణం, పంపిణీ, మార్కెటింగ్ అన్నింటినీ స్వయంగా నిర్వహిస్తూ భారీ లాభాలు పొందుతున్నాడు. ఉదాహరణకు "జవాన్" సినిమా పంపిణీ ద్వారానే వందల కోట్ల ఆదాయం వచ్చింది. అదే విధంగా భారతదేశంలో అధునాతన VFX స్టూడియో అవసరాన్ని గుర్తించి Red Chillies VFX ను స్థాపించాడు. ఈ స్టూడియోలో బాహుబలి, ఆర్ఆర్ఆర్, కల్కి వంటి సినిమాలకు సంబంధించిన విజువల్ ఎఫెక్ట్స్ పనులు జరిగాయి. ఈ నిర్ణయం అతని వ్యాపార దూరదృష్టికి ఉదాహరణ. కేవలం సినిమాల్లోనే కాదు, క్రీడల్లో కూడా పెట్టుబడులు పెట్టాడు. ఐపీఎల్ లో కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టును 300 కోట్లకు కొనుగోలు చేసి, నేడు దాని మార్కెట్ విలువను వేల కోట్ల స్థాయికి తీసుకెళ్లాడు. ఢిల్లీ రోడ్లపై తిరిగిన ఒక యువకుడు నేడు ప్రపంచం గర్వించే స్థాయికి ఎదగడం యాదృచ్ఛికం కాదు. అది అతని కృషి, పట్టుదల, వ్యాపార ఆలోచనల ఫలితం. అందుకే షారుఖ్ ఖాన్‌ను కేవలం రొమాంటిక్ హీరోగా కాకుండా "రెవెన్యూ కింగ్" గా కూడా సినీ ప్రపంచం అభివర్ణిస్తుంది.



డాక్టర్. మహమ్మద్. హసన్ అసిస్టెంట్ ప్రొఫెసర్, సెల్ నెం.9908059234.





# అక్షరాల అక్షయ ప్రవాహం

అక్షరాలు
పుట్టకొస్తున్నాయి —
మౌనపు గర్భంలో నిద్రించిన
ఆలోచనలకు ప్రాణం పోయమంటూ.
అక్షరాలు ప్రకాశిస్తున్నాయి —
అర్థాల సూర్యకాంతిగా
అజ్ఞానపు చీకటిని తరుమమంటూ.
అక్షరాలు పరుగెత్తుతున్నాయి —
కవితా నదీ ప్రవాహంలో
భావాల తీరం తాకమంటూ.
అక్షరాలు పయనిస్తున్నాయి —
కాలపు బాటలో
తరంనుంచి తరానికి వంతెనకట్టమంటూ.
అక్షరాలు పరిమళిస్తున్నాయి —
సాహిత్య సుగంధంగా
హృదయాల లోతులకు చేరుతామంటూ.
అక్షరాలు పల్లవిస్తున్నాయి —
కవిత్వ వసంతంలో
రసాల కోయిలలై ఆలపిస్తామంటూ.
అక్షరాలు పంక్తులవుతున్నాయి —
అనుభవాల శ్రేణులై
జీవితానికి అర్థం చెబుతామంటూ.
అక్షరాలు పరవశపరుస్తున్నాయి —
రచయితల మనసులను మాత్రమే కాదు,
చదువరుల ఆత్మలను కూడా.
అక్షరాలు ప్రేమిస్తున్నాయి —
వలపులవిరితోటలో విహరిద్దామని
సాహితీలోకంలో సంసారం చేద్దామనీ.





గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్, భాగ్యనగరం.

# మద్యంలో కొట్టుకుపోతున్న పేదల ఆర్థికం, ఆరోగ్యం

కూలి చేసి సంపాదించిన పేదల ధనం, ఆరోగ్యం మద్యం ప్రవాహంలో కొట్టుకుపోతున్నాయి. ఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ప్రజలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా ముందుకు తీసుకెళ్లే మార్గాల కంటే మద్యం ఆధారిత ఆదాయంపైనే ఎక్కువ దృష్టి పెట్టిన పరిస్థితి కనిపిస్తోంది. మద్యానికి అలవాటు పడిన చాలా మంది క్రమంగా దానికి బానిసలుగా మారిపోతున్నారు. బాధ వచ్చినా, సంతోషం కలిగినా మద్యం లేకుండా ముందుకు సాగలేని పరిస్థితి ఏర్పడుతోంది.పండుగలు, వేడుకలు, ఎన్నికలు, కొత్త సంవత్సర వేడుకలు—ఏ సందర్భమైనా మద్యం వినియోగం విపరీతంగా పెరుగుతోంది. ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసినా, ఒక్క మద్యం వ్యాపారం ప్రజల ఆర్థిక స్థితిని దెబ్బతీయడంతో పాటు కుటుంబాలను కూడా విచ్ఛిన్నం చేస్తోంది. ధరలు పెరుగుతున్నప్పటికీ మద్యం వినియోగం తగ్గడం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రతి సంవత్సరం మద్యం అమ్మకాలు పెరుగుతూనే ఉన్నాయి.మద్యం అధికంగా సేవించడం వల్ల కాలేయం, క్లోమగ్రంధి, కడుపు సమస్యలతో ఆసుపత్రుల్లో చేరేవారి సంఖ్య పెరుగుతోంది. కొన్ని అధ్యయనాల ప్రకారం పురుషుల్లో మూడింట ఒక వంతు మందికి మద్యం అలవాటు ఉందని తెలుస్తోంది. గుండె వ్యాధులు, డయాబెటీస్, కిడ్నీ సమస్యలు, మానసిక సమస్యలు కూడా పెరుగుతున్నాయి. పేద కుటుంబాల్లో రోజువారీ కూలీ ఆదాయంలో సగం వరకు మద్యం మీదే ఖర్చవుతోంది. దీనివల్ల విద్య, వైద్యం వంటి అవసరాలు పక్కన పడిపోతూ పిల్లల భవిష్యత్తు కూడా ప్రమాదంలో పడుతోంది.

**దండిగా సంక్షేమ పథకాలు ఉన్నా మారని పరిస్థితి**

ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి ప్రభుత్వాలు విద్య, ఆరోగ్యం, ఆహార భద్రత, విద్యుత్తు, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయి. మహిళల ఆర్థికాభివృద్ధి కోసం పలు ప్రోత్సాహకాలు అందిస్తున్నాయి. అయినప్పటికీ మద్యం వ్యసనం కారణంగా పేద కుటుంబాలు ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నిలదొక్కుకోలేక పోతున్నాయి.

**రోజుకు కోట్ల రూపాయల మద్యం విక్రయాలు**

తెలుగు రాష్ట్రాల్లో రోజుకు కోట్ల రూపాయల మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. ఉదాహరణకు ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లాలో రోజుకు సుమారు 6-7 కోట్ల రూపాయల మద్యం అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారం. ఒకప్పుడు పాలు, పెరుగు సమృద్ధిగా ఉండడంతో "పాలమూరు"గా పేరుగాంచిన ప్రాంతాల్లో ఇప్పుడు మద్యం ప్రవాహం ఎక్కువైంది. వనపర్తి జిల్లాలో 15 మండలాలకు 36 మద్యం దుకాణాలు ఉన్నాయి. రోజుకు సగటున రూ.1.20 కోట్ల వరకు మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. గత ఏడాది జనవరితో పోలిస్తే ఈ ఏడాది జనవరిలో మద్యం విక్రయాలు మరింత పెరిగాయి. మద్యం విక్రయాలపై అధికారుల సమీక్షలు జరుగుతున్నప్పటికీ ప్రజల ఆరోగ్యం, విద్య వంటి అంశాలపై అంతగా దృష్టి పడటం లేదన్న విమర్శలు ఉన్నాయి.

**ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి అవసరం**

ప్రభుత్వాలు మద్యం ద్వారా వచ్చే ఆదాయంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులపై దృష్టి పెట్టాలి. ఐటీ, ఫార్మా రంగాల నుంచి పన్నులు, భూముల నిజమైన విలువల ఆధారంగా పన్నులు, రియల్ ఎస్టేట్ అభివృద్ధి ఫీజులు, పర్యాటక రంగ అభివృద్ధి ద్వారా ఆదాయం పొందవచ్చు. వ్యవసాయ ఎగుమతులు, డిజిటల్ సేవలు, గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులు వంటి రంగాలను ప్రోత్సహిస్తే ప్రభుత్వ ఆదాయం పెరగడమే కాకుండా ప్రజల ఆరోగ్యం, సంక్షేమం కూడా కాపాడే అవకాశం ఉంటుంది.








జె.నాగేంద్రమాచారి
జర్నలిస్టు, వనపర్తి
9948034456

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





**ఇరాన్ చరిత్ర**
**ససానియన్ సామ్రాజ్యం (224–651 సిఇ)**
ససానియన్ రాజులు ఇరాన్‌ను శక్తివంతమైన రాజ్యంగా మార్చి రోమన్ సామ్రాజ్యంతో పోటీ పడ్డారు. ఈ కాలంలో జరోస్ట్రియన్ మతం ప్రధా-నంగా ఉండేది.

## మన సాంప్రదాయాలను కాపాడుకోవాలి

**ముద్ర, మల్కాజిగిరి:**

మన సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకుంటూ సమాజ ఐక్యత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. మల్కాజిగిరి పార్లమెంట్ పరిధిలోని ముదుచింతలపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీశ్రీశ్రీ పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవానికి ఎంపీ ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలందరిపై అమ్మవారి చల్లనిచూపు ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు తెలిపారు. గ్రామాభివృద్ధి, సమాజ హితం కోసం ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా అడుగులు వేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఇంతటి గొప్ప కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించిన ముదిరాజ్ సంఘం సభ్యులు, గ్రామ పెద్దలకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. అమ్మవారి అనుగ్రహం మనందరిపై ఎల్లవేళలా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మూడు చింతలపల్లి చైర్మన్ జామ్ రవి, ముదుచింతలపల్లి కౌన్సిలర్ నీరజ్ గౌడ్, నాగసెట్టిపల్లి కౌన్సిలర్ నవీన్ నాయక్ పాల్గొన్నారు.

## కాలనీల అభివృద్ధికి చర్యలు : ఎమ్మెల్యే

**ముద్ర, కాప్రా :**

ఉప్పల్ నియోజకవర్గం పరిధిలోని కాలనీల్లో అభివృద్ధి పనులు వేగవంతంగా జరిగేలా కృషి చేస్తానని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తెలిపారు. బుధవారం కుషాయిగూడ డివిజన్ పరిధిలోని శివసాయినగర్‌లో రూ.4 కోట్ల 55లక్షల వ్యయంతో కొనసాగుతున్న బాక్స్ డ్రెయిన్ అభివృద్ధి పనులను సర్కిల్ ఇంజినీరింగ్ అధికారులు, స్థానికులతో కలిసి ఎమ్మెల్యే పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాప్రా సర్కిల్, కుషాయిగూడ డివిజన్ పరిధిలోని సాయినగర్, శివసాయినగర్, మీనాక్షినగర్ తదితర కాలనీలు వరద మురుగు నీటి ముంపుతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు రూ.4 కోట్ల 55 లక్షలతో బాక్స్ డ్రెయిన్ పనులను చేపట్టినట్లు తెలిపారు. పనులు నాణ్యతతో, సమయానికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కాలనీల సమాఖ్య (సీసీఎస్) అధ్యక్షుడు ఎంపల్లి పద్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నేమూరి మహేష్ గౌడ్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సరస్వతి ఆలయంలో బ్రహ్మోత్సవాలు

**ముద్ర, మల్కాజిగిరి:**

మల్కాజిగిరి ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని అనంత సరస్వతి దేవాలయంలో బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ కూడా పాల్గొన్నారు. దేవాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక హోమాలు, అర్చనలు నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మైనంపల్లి హనుమంతరావు దేవాలయ అభివృద్ధికి తాను ఎప్పుడూ కట్టుబడి ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓ రవీందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బిబ్లాక్ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి.కే. శ్రీనివాస్, పిట్టల శ్రీనివాస్, జి.ఎన్.వి. సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మోత్సవాలు శాంతి, సౌభ్రాతృత్వ వాతావరణంలో కొనసాగుతున్నాయని దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**ముద్ర, శేరిలింగంపల్లి:**

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల ద్వారా మంజూరైన 40 మంది లబ్ధిదారులకు రూ. 40లక్షల 4వేల640 ఆర్థిక సహాయాన్ని పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ చెక్కుల రూపంలో అందజేశారు. శేరిలింగంపల్లి మండలం పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, మాదాపూర్, మియాపూర్, హఫీజ్‌పేట్, చందానగర్, భారతి నగర్ (పార్ట్) డివిజన్లకు చెందిన లబ్ధిదారులకు మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డితో కలిసి చెక్కులు అందజేశారు. ఈసందర్భంగా చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. 250 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేయడం సంతోషకరమని తెలిపారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని, పేదింటి ఆడబిడ్డకు పెద్ద అన్నలా నిలుస్తున్నారని కొనియాడారు.

## రోడ్డు భద్రతా నియమాలు పాటించాలి

**ముద్ర, పెబ్బేరు :**

శ్రీరంగాపూర్ మండల పరిధిలోని వెంకటాపూర్ చౌరస్తా నందు స్థానిక ఎస్సై హిమబిందు ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. అనంతరం వాహనదారులకు రోడ్డు భద్రతలపై, సైబర్ నేరగాళ్ల పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వాహనాన్ని నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెంట్ తప్పనిసరిగా వాడాలని ఆమె సూచించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాలకు ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలని సూచించారు. ఎవరైనా తెలియని వ్యక్తులు బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని, ఓటిపి చెప్పమని అడిగితే నేరుగా బ్యాంకుకే వెళ్లాలని.. ఓటిపి చెప్పవద్దని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది శివరామ్, హుస్సేన్, భగీరథ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా హోలీ వేడుకలు

**ముద్ర, కూకట్‌పల్లి:**

రంగుల పండుగ హోలీని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గంలో పండుగ వాతావరణం నెలకొంది. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు తన నివాసంలో కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులతో కలిసి హోలీ సంబరాలను ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకల్లో కూకట్‌పల్లి నియోజకవర్గ బీజేపీ నాయకులు, కార్యకర్తలతో పాటు పరిశుభ్రత కార్మికులు కూడా పాల్గొనడం విశేషం. అందరూ ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ, మిఠాయిలు పంచుకుంటూ ఆనందోత్సాహాల మధ్య గడిపారు. ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాట్లాడుతూ హోలీ పండుగ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అని పేర్కొన్నారు. సమాజంలో సోదరభావం, ఐక్యత, ప్రేమాభిమానాలు మరింత బలపడాలని ఆకాంక్షించారు.

## జనసేనలోకి గాయత్రీనగర్ మహిళలు

**ముద్ర కూకట్‌పల్లి :**

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలకు ఆకర్షితులై కూకట్‌పల్లి నియోజకవర్గం, అల్లాపూర్ డివిజన్ గాయత్రీ నగర్‌కు చెందిన 31మంది మహిళలు జనసేనలో చేరారు. బుధవారం కెపిహెచ్‌బి పార్టీ కార్యాలయంలో జనసేన నాయకుడు పవన్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో, సైబరాబాద్ కార్పొరేషన్ కోఆర్డినేటర్ ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ.. సమాజ నిర్మాణంలో మహిళల పాత్ర కీలకమని, వారి భాగస్వామ్యం పార్టీకి మరింత బలాన్నిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి జోన్ కోఆర్డినేటర్లు మండలి దయాకర్, కొల్లా శంకర్, మండలి అనిల్, అడక్ కమిటీ సభ్యులు అనిత గాలి, వేముల మహేష్, పోలెబోయిన శ్రీనివాస్, రణదీప్, యోగేష్, జాల రవి, తుంగల రామారావు తదితరులు పాల్గొన్నారు.

# బాచుపల్లి అగ్నిప్రమాద బాధితులను ఆదుకుంటాం



**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

బాచుపల్లిలో జరిగిన అగ్ని ప్రమాద స్థలాన్ని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్ పరిశీలించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకుని బాధితులతో మాట్లాడి వారిని పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రగతి నగర్‌బాచుపల్లి రోడ్డులో పల్నాడు, నరసరావుపేట, గుంటూరు ప్రాంతాల నుంచి 20 ఏళ్ల క్రితం బ్రతుకుదెరువు కోసం వచ్చి ఫర్నిచర్ అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. ఇక్కడే షాపు నడుపుతూ నివాసం ఉంటున్నారని చెప్పారు. కరెంటు లైన్ తెగిపడి అగ్ని ప్రమాదం జరగడంతో 20 ఏళ్లుగా సంపాదించుకున్న సర్వస్వం కళ్లముందే కాలిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వివేకానంద్, కార్పొరేటర్ విజయలక్ష్మి సుబ్బారావు, రచ్చ చక్రధర్, పద్మ ప్రసాద్ తదితర స్థానిక నాయకులతో కలిసి ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. ఈ ఘటన హృదయవిదారకమని, బాధితులు కట్టుబట్టలతో మిగిలిపోయారని అన్నారు. మానవతా కోణంలో స్పందించాలని కోరుతున్నారని చెప్పారు. కలెక్టర్‌తో మాట్లాడి మావంతు సాయం అందిస్తామని, మళ్లీ వ్యాపారం చేసుకునేందుకు అవసరమైన సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదరాబాద్‌లో అనేక చోట్ల కరెంటు తీగలు వేలాడుతున్నాయని, భవనాలపై నిలబడితే చేతికి అందే స్థితిలో ఉన్నాయని అన్నారు. అనేక మంది పెద్దలు, పిల్లలు ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ మాటలకే పరిమితమవుతోందని, ట్రాన్స్‌ఫార్మర్‌ల చుట్టూ సరైన భద్రత లేదన్నారు. తక్షణమే ఈ అంశాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**అధైర్య పడవద్దు.... ఆదుకుంటాం..**

బాచుపల్లి ప్రధాన రహదారిలోని కేజీఆర్ కన్వెన్షన్ వద్ద గల బాచుపల్లి ప్రధాన రహదారి పక్కన గల ఫర్నిచర్ దుకాణాలలో అర్ధరాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంతో రోడ్డున పడ్డ ఫర్నిచర్ షాప్ బాధితులను, సంఘటన స్థలాన్ని బిఆర్ఎస్ ఎల్పి విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ పరామర్శించి బాధితులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ధన్ రాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగారాయ ప్రసాద్, మాజీ కార్పొరేటర్ రవికిరణ్, గాజుల సుజాత, స్థానిక నాయకులు సాంబశివరెడ్డి, శ్రీకర్ గుప్తా, ప్రదీప్, వైఎస్, కురుమూర్తి, అంజన్ కుమార్, రవీందర్ బాబు, జయరాజ్, మహిళా నాయకురాలు లలితా రెడ్డి, క్రిష్ణ మంజరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను విజయవంతం చేయాలి

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా అమలు చేయాలని, పాఠశాలలు, రెసిడెన్సియల్ స్కూల్స్, వసతి గృహాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. జిల్లాలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టనున్న 99 రోజుల కార్యాచరణను సమర్థవంతంగా, సమన్వయంతో అమలు చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నందు అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుధీర్ లతో కలిసి జిల్లా అధికారులతో సమగ్ర దిశానిర్దేశం నిర్వహించారు. జిల్లా అధికారులు మున్సిపల్ కమిషనర్లు తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుండి జూన్ 12 వరకు వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. మార్చి 6 నుండి మార్చి 15 వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ కార్యాలయాలలో ఫైళ్ల పరిష్కరణ అంశంపై ప్రత్యేక డ్రైవ్ చేపట్టనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 6 నుండి ఏప్రిల్ 11 వరకు ఆరోగ్యంఆరోగ్యకరమైన ప్రారంభాలు, ఆశాజనకమైన భవిష్యత్తులు అంశంపై ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో ఆరోగ్య శిబిరాలు, వైద్య పరీక్షలు, గర్భిణీలు మరియు చిన్నారులకు ప్రత్యేక పర్యవేక్షణ, పోషకాహార అవగాహన కార్యక్రమాలు నిర్వహించబడతాయని తెలిపారు. ఏప్రిల్ 13 నుండి ఏప్రిల్ 18 వరకు సురక్షితంగా చేరుకోండి కార్యక్రమం హోం మరియు రవాణా శాఖల ఆధ్వర్యంలో నిర్వహించబడుతుందని తెలిపారు.మొత్తంగా 99 రోజుల కార్యా చరణ గ్రామ, మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయిలలో ఐదు దశల్లో అమలు చేయబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ సుధీర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ రాజేశ్వరి, ట్రైనీ కలెక్టర్ హర్ష్ చౌదరి, డిఆర్ఓ మంగిలాల్, ఆర్డిఓ వాసుచంద్ర, డిఆర్డిఏ శ్రీనివాస్, వ్యవసాయ శాఖ అధికారిరాజారత్నం, వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**నారాయణ పేటలో..**

ముద్ర, నారాయణ పేట : అయిదు దశల్లో 99 రోజుల యాక్షన్ ప్లాన్ చేస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఫణిందర్ రెడ్డి వివరించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. మార్చి 6 నుండి జూన్ 12 వరకు జరిగే యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. ఈనెల 6 నుంచి 15 వరకు అన్ని మున్సిపాలిటీలు గ్రామపంచాయతీలలో శానిటేషన్ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమాలకు నిర్వహణపై కమిషనర్ చైర్మన్, వైస్ చైర్మన్, సర్పంచ్ , కౌన్సిలర్లు పాల్గొంటారని తెలిపారు. ఏప్రిల్ 2న గ్రామ స్థాయిలో గ్రామ సభల నిర్వహణ ఇదే నెల ఏప్రిల్ 16న మండల.... మే 2న నియోజకవర్గ...మే 22న జిల్లా స్థాయిలో కార్యక్రమం ఉంటుందన్నారు. అలాగే జూన్ 2న రాష్ట్ర ఆవిర్భావ వేడుక నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు పరిసరాల పరిశుభ్రత, ప్రభుత్వ ఆఫీసుల్లో పెండింగ్ ఫైళ్ల క్లియరెన్స్ ఉండాలన్నారు. మార్చి 6న ఉమ్మడి జిల్లాల్లో మంత్రుల ఆధ్వర్యంలో సన్నాహక సమావేశాలు ఉంటాయని 99 రోజుల్లో శాఖల వారీగా ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలపై ఫైల్స్ డిస్పోజల్ ఫైల్స్ క్లియరెన్స్ చేయాలన్నారు. మార్చి 16 నుండి 31 వరకు ప్రాపర్టీ టాక్స్ వసూలు చేయాలని జూన్ 2 వరకు ఇందిరమ్మ గృహప్రవేశాలు పూర్తి చేయాలన్నారు. ప్రతి మండలంలో ఒక మోడల్ హౌస్ నిర్మించాలన్నారు. విద్యుత్ శాఖ వారు సోలార్ ఎనర్జీ కార్యాలయాలలో స్కూళ్లలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పోలీసు రవాణా శాఖ ఆధ్వర్యంలో అరైవ్,అలైవ్ కార్యక్రమాలు ఏప్రిల్ 13 నుండి 18 వరకు రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించాలన్నారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ రెవిన్యూ శ్రీను, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

## విద్యార్థులు శ్రమిస్తే విజయం సొంతం

**- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:**

విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి సూచించారు. బుధవారం వికారాబాద్ కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని (కేజీబీవీ) ఆకస్మికంగా తనిఖీ చేశారు. కిచెన్, వంటగది, బియ్యం, పప్పులు, గుడ్లు, కూరగాయలు తదితర ఆహార పదార్థాలను పరిశీలించి మెనూను పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. హాజరు రిజిస్టర్లు పరిశీలించి విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాలు తెలుసుకున్నారు. రోజూ తీసుకునే ఆహారంలో విటమిన్లు, ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు ఉన్నాయా, వార్షిక పరీక్షలకు ఎలా సిద్ధమవుతున్నారో ప్రశ్నించారు. పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని, ప్రతి అంశాన్ని పునశ్చరణ చేయాలని సూచించారు. అనంతరం వికారాబాద్ ఎన్నేపల్లి 1, 2 అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించారు. పిల్లలకు అందిస్తున్న పోషకాహారం, ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలు, హాజరు నమోదు పుస్తకాలు, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. గర్భిణీలు, బాలింతలకు అందిస్తున్న అనుబంధ పోషకాహారంపై వివరాలు తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్యం, శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందికి సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను పరిశీలించి, ప్రీస్కూల్ విద్యా కార్యక్రమాలను మెరుగుపరచాలని ఆదేశించారు. అదే ప్రాంగణంలోని ప్రాథమిక పాఠశాలను పరిశీలించి విద్యార్థులతో ఇంగ్లీష్ కథలు చదివించారు. ఈ కార్యక్రమంలో శిశు సంక్షేమ అధికారిణి కృష్ణవేణి, అంగన్వాడీ టీచర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలిక మృతిపై విచారణ జరపాలి

**ముద్ర, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రతినిధి :**

గిరిజన బాలిక అనూష మృతిపై సమగ్ర విచారణ జరపాలని ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ జిల్లా బాలల సంక్షేమ సమితి, జిల్లా బాలల పరిరక్షణ అధికారికి వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. నవాబ్‌పేట్ మండలం అర్కతల గ్రామానికి చెందిన భూయజమాని అంతమొల్ల దయాకర్ రెడ్డి బలవంతంగా 14ఏళ్ళు నిండని అనూషతో పని చేయించుకోవడం వల్లనే ఆమె మృతి చెందిందని ఆరోపించారు. పనికి వెళ్తున్న క్రమంలో ట్రాక్టర్ బోల్తా పడటంతో గిరిజన బాలిక అనూష మృతి చెందడానికి దయాకర్ రెడ్డి పూర్తి బాధ్యుడన్నారు. పోలీసులు దీనిని సాధారణ ప్రమాద కేసుగా నమోదు చేసి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. త్వరలోనే కార్యాచరణ సిద్ధం చేయనున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో అంబేద్కర్ ప్రజా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కట్టెల మల్లేశం, ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.గీత, బాలల హక్కుల పరి రక్షణ వేదిక జిల్లా కన్వీనర్ బి.శివరాజ్, ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు గుట్టకింది రవికుమార్, విహెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శ్రీకాంత్, వివిధ ప్రజా సంఘాల నాయకులు ఉమ, జామ దశరథ్, శ్రీనివాస్, బి. నరేందర్, ఎ. మల్లేష్, పి. రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నాం

- **స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్**

**ముద్ర, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :**

ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు మెరుగుపడగానే మరో ఆరు నెలల్లో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు తులం బంగారం అందిస్తామని తెలంగాణ రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వికారాబాద్ మండలానికి చెందిన 72 కల్యాణలక్ష్మి, 9 షాదీ ముబారక్, 30 సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్పీకర్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చామని గుర్తుచేశారు. ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ అమలు చేస్తున్నామని, రైతులకు రుణమాఫీ చేపట్టామని పేర్కొన్నారు.

గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేసిందని, ప్రస్తుత బడ్జెట్‌లో ఎక్కువ భాగం అప్పుల అసలు, వడ్డీలకే వెళ్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమర్థ నాయకత్వంతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్రమంగా గాడిలో పడుతోందన్నారు. ఆర్థిక పరిస్థితులు పూర్తిగా చక్కబడిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు తులం బంగారం, కాలేజీలకు వెళ్లే ఆడపిల్లలకు స్కూటీలు పంపిణీ చేస్తామని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు జారీ చేస్తామని, రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం అందిస్తున్నామని చెప్పారు.




## కుత్బుల్లాపూర్‌లో బిఆర్ఎస్‌కు షాక్

- **కాంగ్రెస్‌లో చేరిన మన్నే రాజు**



**ముద్ర, కుత్బుల్లాపూర్ :**

సీనియర్ నాయకుడు, మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా మత్స్యశాఖ కోఆపరేటివ్ చైర్మన్ మన్నే రాజు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల పట్ల ఆకర్షితులై ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి, టీపీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో, టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సమక్షంలో ఆయనకు పార్టీ కండువా వేసి ఘనంగా ఆహ్వానించారు. ఈ పరిణామం కుత్బుల్లాపూర్ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ కార్యక్రమంలో మేడ్చల్‌మల్కాజ్‌గిరి జిల్లా గ్రంథాలయ చైర్మన్ బొంగునూరి శ్రీనివాస్ రెడ్డి, కే.ఎం. గౌరీష్, లక్ష్మారెడ్డి, రషీద్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు బట్టపాల కృష్ణ, సిద్ధనోలు సంజీవరెడ్డి, మైసిగారి శ్రీనివాస్, బైరి ప్రశాంత్ గౌడ్, ఆలేటి శ్రీనివాస్ రావు, ముత్యం రెడ్డి పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
గురువారం 05.03.2026
www.mudranews.in | @mudranews



**ఇరాన్ చరిత్ర**

ఖాజార్ రాజవంశం
(1789–1925)
ఈ కాలంలో ఇరాన్ విదేశీ ప్రభావానికి లోనైంది. ముఖ్యంగా బ్రిటన్, రష్యా ప్రభావం రాజకీయాలపై పెరిగింది.

# ప్రజా సమస్యలు పరిష్కరించాలి

## - కలెక్టర్ రాహుల్ శర్మ



**మహాదేవపూర్, ముద్ర:**
ప్రజా సమస్యలను పరిష్కరించడం, సేవలను సమర్థవంతంగా అందించడం ప్రతి ప్రభుత్వ ఉద్యోగి బాధ్యత అని కలెక్టర్ రాహుల్ శర్మ పేర్కొన్నారు. 99 రోజుల కార్యాచరణ ప్రణాళికపై కలెక్టర్ రాహుల్ శర్మ దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రజా పాలన, ప్రగతి ప్రణాళికలు కార్యాచరణ అమలుపై రెవెన్యూ, పంచాయతీరాజ్, ప్రణాళిక, ఇరిగేషన్, వ్యవసాయం, ఉద్యానవన, విద్యా, వైద్య, సంక్షేమ తదితర శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అంగన్ వాడీ కేంద్రాల సదుపాయాలపై మండలాల వారీ నివేదికలు, అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాల వివరాలు, మరమ్మతులు, విద్యుత్, తాగునీటి సమస్యలపై మండలాల వారీగా నివేదికలు సమర్పించాలని డిడబ్ల్యుఓను ఆదేశించారు. మహిళా సంఘాల బలోపేతానికి 60 రోజుల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాల్లో సభ్యులను నమోదు చేయాలని సూచించారు. బ్యాంకర్లను సమన్వయం చేస్తూ రుణమేళాలను నిర్వహించాలని సూచించారు. యువతలో నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు యూత్ వీక్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. జిల్లా స్థాయి టెలి కమ్యూనికేషన్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు.


ఈ–ఆఫీస్ ద్వారా మాత్రమే ఫైళ్ల స్వీకరణ ఉంటుందన్నారు. ఇక నుంచి అన్ని ఫైళ్లు ఈ–ఆఫీస్ ద్వారానే పంపాలని, నేరుగా పంపిన ఫైళ్లను తిరస్కరిస్తామని స్పష్టం చేశారు. ప్రత్యేక అధికారులు సంక్షేమ గృహాలను తనిఖీ చేసి నివేదికలు సమర్పించాలని తెలిపారు. టాస్క్ ద్వారా యువతకు వృత్తి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. ప్రణాళిక అధికారి ఈ కార్యక్రమానికి నోడల్ అధికారిగా వ్యవహరిస్తారని తెలిపారు.

మున్సిపాలిటీలు, పంచాయతీలలో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. డ్రగ్స్ నివారణ, పిల్లల రక్షణ, భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సంక్షేమ పథకాల లబ్ధిదారుల జాబితా గ్రామసభల్లో చదివి వినిపించాలని, ఇందుకోసం రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, సన్నబియ్యం, రూ.500 లకే గ్యాస్, షాది ముబారక్, కల్యాణ లక్ష్మి , రైతు రుణమాఫీ తదితర పథకాల లబ్ధిదారుల వివరాలను సేకరించి గ్రామసభల్లో చదివి వినిపించాలని సూచించారు. ఈ సమావేశంలో అటవీ అధికారి నవీన్ రెడ్డి, అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఆర్డీఓ బాలకృష్ణ, అన్ని శాఖల అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీఓలు తదితరులు పాల్గొన్నారు.

### క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

తెలంగాణ క్రీడా పాఠశాలల్లో ప్రవేశానికి అర్హత కలిగిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కలెక్టర్ రాహుల్ శర్మ కోరారు. తన ఛాంబర్ లో తెలంగాణా క్రీడా పాఠశాల ఆహ్వాన పోస్టర్ ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హకీంపేట్ లోని తెలంగాణ ప్రభుత్వ స్పోర్ట్స్ స్కూల్ లో 2026–27 సంవత్సరానికి గాను నాలుగో తరగతిలో ప్రవేశానికి ఎంపిక జరుగుతుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు https://tgss.telangana.gov.in/ వెబ్ సైట్ లో పేరు నమోదు సుకోవాలని ఆయన సూచించారు.

# నృసింహస్వామి ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు



**ముద్ర, కరీంనగర్:** జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలోని కిషన్ రావుపేట నాగపల్లి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు, కమిటీ సభ్యులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలు నిర్వహించిన అనంతరం మంత్రికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# పట్టణాభివృద్ధికి సహకరించండి

## - మంత్రి జూపల్లికి మున్సిపల్ చైర్మన్ వినతి



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణాభివృద్ధికి సహకరించాలని నిర్మల్ మున్సిపల్ చైర్మన్ అప్పాల కావ్య, వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి జిల్లా ఇంచార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును కోరారు. ఈ మేరకు బుధవారం వారు హైదరాబాద్ లో మంత్రిని మర్యాద పూర్వకంగా కలిశారు. నిర్మల్ పై ప్రత్యేక శ్రద్ధ చూపి అభివృద్ధికి సహకరించాలని విన్నవించారు. నిర్మల్ అభివృద్ధితో పాటు పట్టణంలోని చారిత్రిక ప్రాధాన్యత ఉన్న శ్యాంఘడ్, బత్తిస్ ఘడ్ లను పర్యాటక కేంద్రాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి ఎస్. వేణుగోపాల చారి, కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజక వర్గ ఇంచార్జి కె. శ్రీహరి రావు తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ కాంప్ కార్యాలయంలో హోలీ వేడుకలు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బుధవారం హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో కలెక్టర్ అభిలాష అభినవ్ దంపతులు, ఎస్పీ జానకి షర్మిల, ఏఎస్పీ సాయికిరణ్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో భాగంగా ఒకరికొకరు రంగులు చల్లుకుంటూ హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రజా తీర్పును గౌరవించని మంత్రి వివేక్



**ముద్ర, ఆదిలాబాద్:** ప్రజా తీర్పును కార్మిక శాఖ మంత్రి వివేక్ గౌరవించడం లేదని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆరోపించారు.| బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ఆదిలాబాద్ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నిక సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సహా బీఆర్ఎస్ నాయకులపై పెట్టిన అక్రమ కేసులో జిల్లా సెషన్స్ కోర్టు బెయిల్ మంజూరుచేయడంతో ఆయన బయటకొచ్చారు. బాల్క సుమన్‌తో పాటు రాజారెడ్డి, అనిల్, లక్ష్మీకాంత్ బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ సందర్భంగా బాల్క సుమన్ మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నిక సందర్భంగా క్యాతనపల్లి మున్సిపల్ ఆఫీసుకు వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారని తెలిపారు. మంత్రి వివేక్ వెంకటస్వామి కాన్వాయ్‌ను ఎలా పంపించారని అడిగితే పోలీసులు తమపై లాఠీ చార్జి చేశారని పేర్కొన్నారు. వాళ్లు దాడి చేస్తే.. మాపైనే రివర్స్‌లో కేసు పెట్టారని మండిపడ్డారు. ఈ ఘటనలో 22 మందిపై అక్రమ కేసులు పెట్టారని చెప్పారు. క్యాతనపల్లి మున్సిపాలిటీ పరిధిలో కేవలం 7 స్థానాల్లో మాత్రమే గెలిచిన కాంగ్రెస్ పార్టీకి మున్సిపల్ పీఠం ఎలా వస్తుందని మండిపడ్డారు. జిల్లాలోని కలెక్టర్ నుంచి తహశీల్దార్ వరకు ప్రతి ఒక్కరూ ప్రభుత్వ ఉద్యోగుల్లా కాకుండా విశాఖ ఇండస్ట్రీస్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారని ఎద్దేవా చేశారు.

# మంత్రిని కలిసిన కార్యదర్శి



**ముద్ర, హైదరాబాద్:**
తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్సియల్ ఎడ్యుకేషనల్ ఇన్ స్ట్యూషన్స్ సొసైటీ కార్యదర్శిగా, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన విజయేంద్ర బోయి బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాఖ పరిధిలో అమలవుతున్న సంక్షేమ, విద్యా కార్యక్రమాల పురోగతిపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకుల విద్యాసంస్థల అభివృద్ధి, విద్యార్థుల సౌకర్యాల మెరుగుదల, పరిపాలన బలోపేతంపై సూచనలు చేశారు. సాంఘిక సంక్షేమ శాఖ పనితీరును మరింత సమర్థవంతంగా, పారదర్శకంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని విజయేంద్ర బోయి తెలిపారు.

# పిల్లలపై దాడులు ఆపాలి




**ముద్ర, కరీంనగర్:**
పిల్లలపై మానసిక, లైంగిక దాడలు ఆపాలని కాంగ్రెస్ నాయకులు కోరారు. జాతీ య, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ శాఖల పిలుపుమేరకు కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం ధర్మారం గ్రామంలో బుధవారం మండల శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పిల్లలపై మానసిక, లైంగిక దాడికి పాల్పడిన జెఫ్రీ ఎప్‌స్టీన్‌తో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరికి సంబంధాలు ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రికి ప్రధాని మోదీ మద్దతు తెలపడాన్ని నిరసిస్తూ మహిళలతో సంతకాలు సేకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్న, మానకొండూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కవ్వ పద్మ, మండల అధ్యక్షురాలు చింతి రెడ్డి పద్మ, మహిళలు పాల్గొన్నారు.

# మంత్రి కార్యాలయం వద్ద హోలీ సంబరాలు



**ముద్ర, కరీంనగర్:**
కరీంనగర్ లో బుధవారం హోలీ పండుగ వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్యాంపు కార్యాలయం వద్ద కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హోలీ సంబరాలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని పొన్నం కాంప్లెక్స్‌లో జరిగిన ఈ వేడుకల్లో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని రంగులతో ఆనందంగా హోలీ జరుపుకున్నారు.

ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటి రెడ్డి నరేందర్ రెడ్డి, కార్పొరేటర్లు మల్లి ఖార్జున రాజేందర్, పర్వతాల మల్లేశం, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మా కర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ బీసీ సెల్ చైర్మన్ పులి ఆంజనేయులు గౌడ్, మహిళా కాం గ్రెస్ అధ్యక్షురాలు సత్య ప్రసన్నారెడ్డి, జిల్లా కాంగ్రెస్ ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రావణ్ నాయక్ తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభివృద్ధికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్తో పాటు ఎమ్మెల్యేల సహకారంతో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ప్రజల జీవితాలు హోలీ రంగుల్లా ఆనందంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పరస్పరం రంగులు చల్లుకుంటూ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.

# గణిత శాస్త్రంతో అద్భుతాలు సృష్టించవచ్చు




**ముద్ర, కరీంనగర్:**
గణిత శాస్త్రంతో అద్భుతాలు సృష్టించవచ్చని, సమాజంలో అగ్రగామిగా ఉండవచ్చని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ–టెక్నో స్కూ ల్ లో బుధవారం ప్రతిష్టాత్మక చింతన మ్యాథ్స్ ఒలంపియాడ్ జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించిన డి.సాత్విక్, ఏ.రీతిక, జి. సహాంస్, కే .అతిథి కిషన్, ఏ.సాయి చందన, ఎ.శ్రేయాన్ కార్తీక్ లను సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ భవిష్యత్తులోనూ మరిన్ని అద్భుత విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు గణిత శాస్త్రంలో పట్టు సాధించే విధంగా ప్రోత్సాహం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పోటీ పరీ క్షలు నిర్వహించి ప్రతిభను వెలికి తీయాలన్నారు. తమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు వివిధ రకాలు ఒలంపియాడ్ నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో ప్రతిభ చాటిన విద్యార్థులను వివిధ రకాల పోటీలకు ఎంపిక చేసి అగ్రగామిగా నిలిపేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

# 'సోలార్ ' వాహనం ప్రారంభించిన అడిషనల్ కలెక్టర్




**ముద్ర, కరీంనగర్:**
ప్రధానమంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకంలో భాగంగా సోలార్ విద్యుత్ అవగాహన ప్రచార వాహనాన్ని అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే కలెక్టరేట్ నుంచి ప్రారంభించారు. 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 నుంచి జూన్ 12 వరకు 99 రోజుల పాటు వివిధ పథకాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా టీఎస్ రెడ్ కో ఆధ్వర్యంలో జిల్లాలోని 16 మండలాల పరిధిలో ప్రధాన మంత్రి సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం గురించి అవగాహన కల్పించనున్నారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా గృహ వినియోగదారులు తమ ఇంటి డాబాపై సోలార్ ప్లాంటు ఏర్పాటు చేసుకొని ప్రతి నెలా 360 యూనిట్ల సోలార్ విద్యుత్ వరకు పొందవచ్చునని సూచించారు. ఈ ప్లాంట్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ కల్పించనుందని తెలిపారు.

**ఇరాన్ చరిత్ర**

**సఫవీడ్ సామ్రాజ్యం (1501–1736)**



సఫవీడ్ రాజులు ఇరాన్‌ను ఒక శక్తివంతమైన రాజ్యంగా మళ్లీ నిర్మించారు. షియా ఇస్లాంను అధికారిక మతంగా ప్రకటించి దేశ గుర్తింపును మార్చారు.

# ముక్కిన బియ్యానికి మోక్షం

- వేలానికి గోదాముల్లోని దొడ్డు బియ్య సిద్ధం

**వరంగల్, ముద్ర :**



రేషన్ దుకాణాలు, ఎంఎల్ఎస్ కేంద్రాల్లో నెలల తరబడి నిల్వ ఉండి ముక్కిపోతున్న దొడ్డు బియ్యానికి త్వరలోనే మోక్షం కలగనుంది. కిలో బియ్యాన్ని రూ.21.60కు విక్రయించేందుకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపిన నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ టెండర్లు ఆహ్వానించేందుకు సిద్ధమవుతోంది. గత ఏడాది ఏప్రిల్ నుంచి ప్రభుత్వం సన్నబియ్యాన్ని పంపిణీ చేయడం ప్రారంభించడంతో అప్పటి వరకు రేషన్ దుకాణాల్లో ఉన్న దొడ్డు బియ్యాన్ని ఎంఎల్ఎస్ కేంద్రాలు, గోదాములకు తరలించారు. సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడంతో చాలా చోట్ల బియ్యం పురుగులు పట్టి ముక్కిపోతున్న పరిస్థితి ఏర్పడింది. అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో రేషన్ దుకాణాల్లో 847.356 క్వింటాళ్లు, గోదాముల్లో 1,020.052 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది. అయితే గత పది నెలలుగా నిల్వలపై సమగ్ర తనిఖీలు జరగకపోవడంతో కొందరు డీలర్లు బియ్యాన్ని విక్రయించి సొమ్ము చేసుకున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భారీ వర్షాలు, ఎలుకలు, పందికొక్కులు కారణంగా బియ్యం నష్టపోయిందని కొందరు చెప్పుకుంటున్నా నిజానిజాలపై అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఇక తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న 359.198 క్వింటాళ్ల బియ్యం కూడా ఎంఎల్ఎస్ కేంద్రాల్లోనే నిల్వ ఉంది. ప్రతి ఆరు నెలలకు ఒకసారి వేలం వేయాల్సి ఉన్నా రెండేళ్లుగా ఈ ప్రక్రియ జరగకపోవడంతో ఆ బియ్యం కూడా పురుగులు పట్టే పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో దొడ్డు బియ్యం, సీజ్ చేసిన బియ్యాన్ని వారం రోజుల్లో టెండర్ల ద్వారా వేలం వేసే అవకాశముందని పౌరసరఫరాల అధికారులు తెలిపారు. దీంతో నెలలుగా నిల్వలో ఉన్న బియ్యానికి చివరికి మోక్షం దక్కనున్నట్లు కనిపిస్తోంది.




## కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ రాజీనామా చేయాలి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

కేంద్ర పెట్రోలియం, గ్యాస్ మంత్రి హరి దీప్ సింగ్ పూరి వెంటనే రాజీనామా చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా డిసిసి మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ డిమాండ్ చేశారు. బుధవారం భువనగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన జిల్లా ఎగ్జిక్యూటివ్ మీటింగ్ వైట్ షర్ట్స్ ధరించి రేపిస్ట్ జెఫ్రి ఎక్స్ టెన్ ను వ్యతిరేకిస్తూ సంతకాలు చేసి హోలీ జరుపుకున్నారు. ఈ సందర్భంగా నీలం పద్మ మాట్లాడుతూ రేపిస్ట్ జెఫ్రి ఎక్స్టెన్ తో హర్దీప్ సింగ్ పూరి కేంద్ర గ్యాస్ పెట్రోలియం మంత్రి కి ఏంటి సంబంధమని ప్రశ్నించారు. ఫైల్స్ లో ప్రస్తావన ఎక్స్టెన్ ఫైల్ అంటే ఏమిటని వారు బతికి ఉన్నప్పుడు ఎన్నో అరాచకాలు చేసి వారు చనిపోయిన తర్వాత ఈ మెయిల్ డేటా 44 సేకరించిన అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఏ విధంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీని ఆడిస్తున్నాడో ఈ మెయిల్స్ లో వారి బాగోతం మొత్తం డేటా బయటపడిందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి పావని, మండల అధ్యక్షురాలు కవిత, రజిత, పట్టణ అధ్యక్షురాలు డి.కవిత మహిళలు పాల్గొన్నారు.



## నరేష్ యాదవ్ కు సన్మానం

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

భువనగిరి మండలంలోని తుక్కాపురం గ్రామ పంచాయతీకి చెంగిచెర్లకు చెందిన బింగి నరేష్ యాదవ్ తల్లిదండ్రులు బింగి శాంతమ్మ పెంటయ్య జ్ఞాపకర్థంగా సుమారు రూ.60 వేల విలువగల మైక్ సెట్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ జనగాం పాండు ఆధ్వర్యంలో బింగి నరేష్ యాదవ్ ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లోకేష్, ఉప సర్పంచ్ రాసాల లింగస్వామి యాదవ్, వార్డు మెంబెర్లు జనగాం ఇంద్రిరమ్మ యాదయ్య, రత్నపురం శ్రీకాంత్, జనగాం మహేష్, రాసాల శరత్ యాదవ్, వల్లపు సతీష్ యాదవ్, ముంత కిష్ణవేణి రమేష్ యాదవ్, దొమ్మటి భాగ్యలక్ష్మి, దేవేందర్, ఎల్లకొండ అలివేలు రాజశేఖర్ రెడ్డి, రాసాల క్రాంతి యాదవ్ గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## గిరిజన తండాలో హోలీ వేడుకలు

- బంజారాలతో కలిసి సంప్రదాయ నృత్యాలు చేసిన బీర్ల అయిలయ్య

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

బొమ్మలరామారం మండలం గోవింద్ తండాలో జరిగిన హోలీ వేడుకల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కలిసి రంగులు చల్లుకుని ఆనందాన్ని పంచుకున్నారు. బంజారా సోదర, సోదరీమణులతో కలిసి సాంప్రదాయ నృత్యాల్లో పాల్గొని అందరినీ ఉత్సాహపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోలీ పండుగ సోదరభావం, ఐక్యతకు ప్రతీక అని అన్నారు. గోవింద్ తండా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని తెలిపారు.



## యాదగిరిగుట్టలో సందడి..

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**

యాదగిరిగుట్ట పట్టణంలో ప్రజలు హోలీ వేడుకలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ ప్రజలందరికీ హోలీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బోడ రాధా సురేష్, కాటబత్తిని స్వప్న ఆంజనేయులు, గుండ్లపల్లి రామ్, శ్రీధర్ గౌడ్, సుడుగు జీవన్ రెడ్డి, వంగపల్లి అరుణ్, పులగం విజయ్, ప్రశాంత్, పట్టణ ప్రజలు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆసుపత్రిని తనిఖీ చేసిన కలెక్టర్

- భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల్లో ఉన్న వైద్యులు, సిబ్బందికి సంబంధించిన వెరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు, వారికి అందుతున్న వైద్య సేవలకు సంబంధించిన వివరాలను కలెక్టర్ తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అవసరమైన ఔషధాలు అన్ని అందుబాటులో ఉండాలని, గడువు ముగిసిన మందులను పరిశీలించి వాటిని తీసేయాలని సూచించారు. రోగులకు మందులు ఇచ్చేటప్పుడు ఒకటికి రెండు సార్లు పరిశీలించి అందజేయాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే గర్భిణులకు మెరుగైన వైద్యం అందించాలని, ప్రసవాల సంఖ్య పెంచాలని సూచించారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, వైద్యులు, సిబ్బంది అందరూ అంకితభావంతో బాధ్యతాయుతంగా పనిచేయాలని అన్నారు. జీ జీ.హెచ్ లో నిర్మాణంలో అదనపు గదుల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ పాండు నాయక్, డాక్టర్స్ సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## అత్యవసర సేవలను సమర్థవంతంగా నిర్వహించాలి

- భద్రాద్రి జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి తుకారామ్ రాథోడ్

**ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం:**

భద్రాద్రి కొత్తగూడెం వైద్య, ఆరోగ్య శాఖ అధికారి జిల్లా కార్యాలయంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్ జిల్లాలోని 102, 108 అంబులెన్స్ వాహనాల కోఆర్డినేటర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో 102, 108 అంబులెన్స్ సేవలను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలను సురక్షిత ప్రసవాల కోసం ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. గ్రామీణ మరియు దూర ప్రాంతాల్లో కూడా వాహనాలు సమయానికి అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే ఆయా పరిధిలో అంబులెన్స్ వాహనాలను సిద్ధంగా ఉంచి గర్భిణీలు, బాలింతలు మరియు ఇతర అత్యవసర రోగులకు తక్షణ సేవలు అందేలా కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో 102, 108 జిల్లా కోఆర్డినేటర్లు డిపిఎంవోమోహన్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన భోజనం అందించాలి

- భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



బాలసదనంలో ఉన్న విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరిలో గల మీనానగర్ లో బాలసదనం ను జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆకస్మిక తనిఖీ చేశారు. బాలసదనంలో సిబ్బందికి సంబంధిచిన హాజరు పట్టికను పరిశీలించి, విద్యార్థుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. బాలసదనంలో ఉన్న పిల్లలతో కలెక్టర్ ముచ్చటించి, రుచి కరమైన భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులను మీకు ఏమైనా కావాలా? అని అడగగా పిల్లలు మ్యూజిక్ టీచర్ కావాలని పిల్లల కోరారు. ఈ మేరకు మ్యూజిక్ టీచర్ ను తాత్కాలికంగా నియమించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాలసదనంలో వాటర్ ఫిల్టర్ పనిచేయడం లేదని తెలపడంతో వెంటనే మరమ్మతులు చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బెడ్ షీట్ లు సరిగా లేకపోవడంతో కొత్త బెడ్ షీట్లు ఇవ్వాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న బాలసదనం భవనం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహ రావు, మున్సిపల్ కమిషనర్ రామలింగం, భువనగిరి తహసీల్దార్ జగన్ మోహన్ ప్రసాద్, బీ ఆర్ బీ ఆర్డినేటర్ అనంత లక్ష్మీ, యశోద, బాలసదన్ సిబ్బంది, పిల్లలు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా ఆలయ శుద్ధి

- తెరుచుకున్న స్వర్ణగిరి శ్రీవారి ఆలయ తలుపులు
- మధ్యాహ్నం నుంచి పునః దర్శనం ప్రారంభం

**ముద్ర, భువనగిరి ప్రతినిధి :**



భూలోక వైకుంఠమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో బుధవారం శాస్త్రోక్తంగా ఆలయ శుద్ధి, పుణ్యాహవచనం, సంప్రోక్షణాది వైదిక కార్యక్రమాలు అర్చక స్వాములచే భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. సమస్త శుద్ధి క్రతువులు సంపూర్ణంగా పూర్తి అయిన అనంతరం మధ్యాహ్నం 2.30 గంటల నుండి భక్తులకు శ్రీ వారి దర్శన భాగ్యం పునఃప్రారంభించారు. సాయంత్రం ఆదిమధ్యాంతరహితుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మాడవీధులలో శోభాయ మానంగా ఊరేగిస్తూ భక్తుల గోవింద నామస్మరణలతో మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య శ్రీ స్వామివారి తిరువీధి ఉత్సవ సేవను ఘనంగా నిర్వహించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
గురువారం 05.03.2026
www.mudranews.in | @mudranews



### ఇరాన్ చరిత్ర

ఖాజార్ రాజవంశం (1789–1925)



ఈ కాలంలో ఇరాన్ విదేశీ ప్రభావానికి లోనైంది. ముఖ్యంగా బ్రిటన్ మరియు రష్యా ప్రభావం రాజకీయాలపై పెరిగింది.

# అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి

- సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి

**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

అభివృద్ధి పనులు త్వరతగతిన పూర్తి చేయాలని సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ జిల్లాలోని ఏంజీ ఎన్ఆర్ఈజీఎస్ కింద నిర్మాణంలో ఉన్న పనుల ఈ ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనుల గూర్చి ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో అంగన్వాడి భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, సబ్ సెంటర్, గ్రామ మహిళా సమాఖ్య, ఫుడ్ గ్రైన్ స్టోరేజ్, సీసీ రోడ్లు, ఆయా పాఠశాలలో ప్రహరీలు, మరుగుదొడ్ల నిర్మాణాలపై సమీక్షించారు. అన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణాలకు మొదటి ప్రాధాన్యతగా తీసుకుని పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో మంజూరు చేసిన ఈజీఎస్ పనులు పూర్తి చేసి ఆ నిధులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ 15 రోజులు అత్యంత కీలకం అని ఆయా నిర్మాణాలు ఒక ప్రణాళిక ప్రకారం రోజు వారీగా ప్రోగ్రెస్ తీసుకురావాలని ఆయా స్థాయిలో నిర్మాణం పూర్తి కాగానే మాస్టర్ జెనరేట్ చేసుకుని అప్లోడ్ చెయ్యాలని తెలిపారు. ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం, మండలం, గ్రామాల వారీగా ప్రారంభాలకు సిద్ధం చేయాలని పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీవో జయదేవ్ ఆర్య, పంచాయతీరాజ్ ఈఈ చిరంజీవి, ఏఈలు పాల్గొన్నారు.




అధికారులతో సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ హైమావతి

# కేంద్ర బడ్జెట్ సంపన్నుల కోసమేనా?

సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు




**ముద్ర ప్రతినిధి, మెదక్:**

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ సంపన్నుల కోసమే అన్నట్లు ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కారాములు ధ్వజమెత్తారు. బుధవారం మెదక్ జిల్లా కేంద్రంలో కేవల్ కిషన్ భవనంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా సెమినార్‌లో ఆయన మాట్లాడారు. కేంద్ర ఆర్థిక మంత్రి రూ.53,47,315 కోట్ల బడ్జెట్ ప్రవేశ పెట్టారని, ఈ బడ్జెట్ లో దేశ ప్రజలకు, కార్మిక వర్గానికి, రైతులకు, వ్యవసాయ కార్మిక వర్గానికి ఏమాత్రం వర్తించదన్నారు. దేశంలో సంపన్నులకు మాత్రమే ఉపయోగకరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి 8 మంది బీజేపీ పార్లమెంటు సభ్యులు ఉన్నప్పటికీ రాష్ట్రానికి బడ్జెట్ తీసుకు రాలేదన్నారు. రైల్వే, నీటి ప్రాజెక్టులకు బడ్జెట్ కేటాయింపులు లేవన్నారు. కేంద్రం ద్వారా అమలు అవుతున్న సంకేమ పథకాలకు సబ్సిడీలు తగ్గించిందన్నారు. ఇది పేద ప్రజలకు నష్టం కలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. వికసిత భారత్, బ్యాంకింగ్ రంగంలో ప్రైవేటీకరణ కొనసాగించడం అంటే బ్యాంకులను విలీనాలు, ప్రైవేటీకరణ కొనసాగించడమే అన్నారు. కార్పొరేట్ కంపెనీలు కట్టే పన్నుల వాటా 18 శాతం మాత్రమే ఉండగా అత్యధిక మధ్యతరగతి కట్టే ఆదాయపు పన్ను వాటా 21 శాతం ఎక్కువగా ఉందన్నారు. స్కీమ్ వర్కర్లకు 2018 నుంచి కేంద్ర ప్రభుత్వం వేతనాలు పెంచడం లేదని తెలిపారు. కార్మికులు, ఉద్యోగుల ప్రస్తావన బడ్జెట్ లో రాలేదన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పని దినాల సంఖ్య 2021––22లో 380.04 కోట్ల నుంచి 2025–– 26 లో 183 .77 కోట్లకు తగ్గిందన్నారు. బడ్జెట్ కూడా తగ్గిందన్నారు. పెరుగుతున్న నిత్యావసరాల ధరలకు అనుకూలంగా జీతాలు పెంచడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఫ్లోర్ లెవెల్ మినిమం వెజ్ కార్మికునికి రోజుకి రూ. 178 ఉంటే సరిపోతుందని చెప్పడం అన్యాయమన్నారు. రైతులకు, వ్యవసాయ కార్మికులకు బడ్జెట్లో కేటాయింపులు లేవని అన్నారు. విద్యా రంగానికి కేవలం మూడు శాతం మాత్రమే కేటాయించడం అన్యాయమన్నారు. ఈ సెమినార్ లో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఏ. మల్లేశం, బాలమణి, కోశాధికారి నర్సమ్మ, జిల్లా ఉపాధ్యక్షులు మహేందర్, నాగరాజు, సహాయ కార్యదర్శులు గౌరయ్య, సంతోష్, అన్నపూర్ణ, నాగేందర్ రెడ్డి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశం, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

## రెండు రోజులు భగీరథ నీటి సరఫరాకు అంతరాయం



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

సమ్మర్ యాక్షన్ ప్లాన్ తయారీలో భాగంగా ఈనెల 5,6 తేదీల్లో కొన్ని ప్రాంతాలకు నీటి సరఫరా నిలిపి వేస్తున్నట్లు మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ నాగభూషణం తెలిపారు. మెదక్ నియోజకవర్గ పరిధిలోని 275 గ్రామీణ హాబిటేషన్లు, మెదక్, రామాయంపేట మున్సిపాలిటీలు. ఆందోలు నియోజకవర్గంలోని అల్లాదుర్గ్, టేక్మాల్ మండలాలో 80 హాబిటేషన్లు ఉన్నాయి. ప్రభావిత హాబిటేషన్ల సర్పంచ్‌లకు సంబంధిత మండల గ్రూపుల ద్వారా సమాచారం అందించినట్లు తెలిపారు. స్థానిక వనరుల ద్వారా నీటి సమస్యను పునరుద్ధరించే దిశగా చర్యలు తీసుకోవాలని సూచించారు. 90 ఎమ్మెల్డీ పెదరెడ్డిపేట – వివిధ నిర్వహణ పనుల నిమిత్తం వెయ్యి మి.మీ. డయా పైప్‌లైన్ లీకేజీలు, రాయిపహాడ్ ఓహెచ్ బి ఆర్ వద్ద స్లూయిస్ వాల్వ్ మరమ్మతు, అన్ని సివిల్ నిర్మాణాలు శుభ్రపరచడం వంటివి చేపడుతున్నట్లు తెలిపారు. ఎల్లాపూర్ వద్ద 700 మి.మీ. డీ1 స్లూయిస్ వాల్వ్ మరమ్మతు చేస్తున్నామన్నారు. 6న సాయంత్రం 6 గంటల తరువాత పంపింగ్ పునః ప్రారంభించబడుతుందని తెలిపారు.

# మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

- మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మరాఠీ సంతోష్




**సిద్దిపేట, ముద్ర ప్రతినిధి:**

ఎస్సీ వర్గీకరణ సాధ్యమైంది అంటే అది మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమేనని మాదిగ ఉద్యోగుల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు మరాఠీ సంతోష్, ఉపాధ్యక్షులు నరేష్ తెలిపారు. సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ నాయకులతో కలిసి మాదిగ ఉద్యోగ సమాఖ్య నాయకులు మాట్లాడారు. మాదిగ ఉద్యోగులు, మేధావులు అని చెప్పుకుంటూ ఈనెల 6న హైదరాబాద్‌లోని శిల్పకళా తోరణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సన్మానం అంటూ సోషల్ మీడియాలో మెసేజ్ ప్రచారం చేస్తున్నారని తెలిపారు. ఈ సన్మాన కార్యక్రమానికి ఎమ్మార్పీఎస్ కు ఎలాంటి సంబంధం లేదని, ఈ సన్మాన కార్యక్రమంలో మందకృష్ణ మాదిగ పాల్గొనడం లేదని తెలిపారు. అలాగే ఎమ్మార్పీఎస్ కు అనుబంధంగా ఉన్న మాదిగ ఉద్యోగుల సమాఖ్య నాయకులు గానీ, ఎమ్మార్పీఎస్ నాయకులు గాని ఈ కార్యక్రమంలో పాల్గొనవద్దు అని పిలుపునిచ్చారు. ఈ మీడియా సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు మొక్కపల్లి రాజు, నాయకులు మల్లిగారీ యాదగిరి, నాగరాజు కిష్టయ్య పలువురు పాల్గొన్నారు.

## దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలి

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణంలోని చౌరస్తాలో గల మహాత్మా గాంధీ విగ్రహాన్ని అవమానపరిచిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పట్టణ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు డిమాండ్ చేశారు. అహింసా మార్గంలో స్వాతంత్ర్యం తెచ్చిన మహనీయుడికి జరిగిన ఈ అవమానం దేశానికే అవమానమని ఆయన పేర్కొన్నారు. విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని తక్షణమే గుర్తించి అరెస్టు చేయాలని పోలీసులను కోరారు.

## ఇందిరమ్మ బిల్లులు రూ. 111 కోట్లు చెల్లింపులు

- మెదక్ కలెక్టర్ ప్రతిమా సింగ్



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు జిల్లా వ్యాప్తంగా 5,201 ఇందిరమ్మ ఇండ్లకు 111 కోట్ల రూపాయలు చెల్లించినట్లు కలెక్టర్ ప్రతిమ సింగ్ తెలిపారు. కౌడిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను మంజూరైన లబ్ధిదారులు త్వరితగతిన పనులు ప్రారంభించి, నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రతివారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణాల బిల్లులను చెల్లిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా వివిధ దశల్లో ఉన్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను లబ్ధిదారులు పూర్తి చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక తహసీల్దార్, ఎంపీడీవో, హౌసింగ్ అధికారులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి క్రికెట్ లో రాణిస్తున్న కానిస్టేబుల్

- ఎస్పీచే సన్మానం, నగదు ప్రోత్సాహకం అందజేత



**ముద్ర ప్రతినిధి, మెదక్:**

జాతీయ స్థాయి క్రికెట్ క్రీడాకారుడు కానిస్టేబుల్ సాయి కుమార్‌ను ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఘనంగా సన్మానించి నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. క్రీడా రంగంలో ఆయన సాధించిన విజయాలను గుర్తించి అభినందించారు. తిరుపతిలో ఇటీవల నిర్వహించిన సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్‌లో సాయి అద్భుత ప్రదర్శనతో జట్టును సెమీ ఫైనల్ వరకు చేర్చడం, ఎలైట్ క్రికెట్ ప్రీమియర్ లీగ్‌లో తెలంగాణ పోలీస్ క్రికెట్ జట్టు విజేతగా నిలవడంలోనూ ప్రధాన పాత్ర పోషించారు. ఈ విజయాలతో జిల్లా పోలీస్ శాఖకు రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకువచ్చారని ఎస్పీ ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలేందర్, ఎస్బీ ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, సీసీ రాజేందర్ పాల్గొన్నారు.

# భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలి

- నిమ్జ్ ప్రాజెక్టులో మౌలిక వసతుల కోసం
- సరిహద్దు రాళ్ల ఏర్పాటుకు అధికారుల యత్నం
- పనులను అడ్డుకున్న ముంగి గిరిజన తండా వాసులు
- భారీ పోలీసు బందోబస్తు

**ముద్ర, సంగారెడ్డి:**

నిమ్జ్ ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న బాధితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని సంగారెడ్డి జిల్లా న్యాల్‌కల్ మండలంలోని ముంగి గిరిజనతండా వాసులు స్పష్టం చేశారు. మంగళవారం సంగారెడ్డి కలెక్టర్ ఆదేశాల మేరకు నిమ్జ్ ప్రాజెక్టు కోసం మొదటి విడతలో సేకరించిన 3,245 ఎకరాల్లో మౌలిక వసతుల కోసం సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసేందుకు భారీ పోలీసు బందోబస్తు మధ్య మండల రెవెన్యూ, నిమ్జ్ అధికారులు, ఎస్ఆర్ఆర్ ప్రైవేట్ డెవలపర్స్ కలిసి ముంగి గిరిజన తండాకు చేరుకున్నారు. స్థానిక గ్రామ శివారులోని ప్రభుత్వ, పట్టా భూములకు సంబంధించిన 1,536 ఎకరాల చుట్టూ సంబంధిత అధికారులు సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేసేందుకు జేసీబీలతో గుంతలు తవ్వుతుండగా తండాకు చెందిన బాధిత రైతులు, తండావాసులు అడ్డుకున్నారు. ఉపాధి కోసం ప్రభుత్వం భూములు పంపిణీ చేస్తే వాటిని నమ్ముకుని కుటుంబాలను పోషించుకుంటున్నామన్నారు. నిమ్జ్ ప్రాజెక్టులో గ్రామానికి చెందిన భూములు తీసుకున్నప్పటికీ ఎకరానికి రూ.5.60 లక్షలు మాత్రమే చెల్లించి ప్రభుత్వం చేతులు దులుపుకొంటున్నారు. అరకొరగా చెల్లించిన పరిహారంతో తీవ్రంగా నష్టపోయామని, మార్కెట్‌లో ఇంటి స్థలాన్ని కూడా కొనుగోలు చేసేందుకు వీలులేకుండా పోయిందన్నారు. భూమికి బదులుగా మరోచోట భూములు ఇవ్వాలని బాధిత రైతులు డిమాండ్ చేశారు. 2013 భూ సేకరణ చట్టం ప్రకారం తమ భూములకు మెరుగైన పరిహారం చెల్లించాలని, భూములపై ఆధారపడిన రైతులు, కూలీలకు పునరావాసంతో పాటు భూములు కోల్పోయిన బాధిత రైతులకు 125 గజాల ఇంటి స్థలం, ఇల్లు, ఫ్యాక్టరీల్లో ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ హైకోర్టులో కేసు వేశామని, కోర్టు తీర్పు వచ్చే వరకు తమ భూముల్లో ఎలాంటి పనులు చేయవద్దని సంబంధిత అధికారులతో మొరపెట్టుకున్నారు.



నిమ్జ్ ప్రాజెక్టులో పరిశ్రమలు ఏర్పాటు చేసేందుకు కావాల్సిన మౌలిక వసతులు ఏర్పాటు చేసేందుకు సరిహద్దు రాళ్లు ఏర్పాటు చేస్తున్నామని, ఇప్పుడే భూములు స్వాధీనం చేసుకోవడం లేదని, సాగులో ఉన్న పంటలు కోత పూర్తైన తర్వాతే పనులు చేపడుతామని సంబంధిత నిమ్జ్, రెవెన్యూ అధికారులు తెలిపినా బాధిత రైతులు, తండావాసులు ఒప్పుకోలేదు. ఎకరానికి రూ. 15 లక్షల చొప్పున పరిహారంతో ఇతర వసతులు కల్పించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఈ విషయాన్ని సంబంధిత అధికారులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జహీరాబాద్ ఆర్టీవో దేవుజాతో బాధిత రైతులు, తండావాసులు మాట్లాడారు.బుధవారం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయానికి బాధిత రైతులు, తండావాసులు వస్తే సమస్యలు తెలుసుకుని న్యాయం చేస్తామని ఆర్డీవో చెప్పడంతో బాధిత రైతులు, తండావాసులు శాంతించారు. దీంతో సంబంధిత అధికారులు, పోలీసులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జహీరాబాద్ రూరల్ సీఐ జక్కుల హనుమంతు ఆధ్వర్యంలో భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# జాతిపితకు అవమానం

- విగ్రహానికి పేడకొట్టి, చెప్పు పెట్టిన దుండగులు





నిరసన ప్రదర్శన అనంతరం గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి పూలమాల వేస్తున్న నాయకులు

**ముద్ర ప్రతినిధి, మెదక్:**

మెదక్ పట్టణంలో జాతిపితకు అవమానం జరిగింది. రాందాస్ చౌరస్తాలో గల మహాత్మాగాంధీ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసేందుకు యత్నించారు. విగ్రహానికి పశువుల పేడకొట్టి, ఒక కన్ను ధ్వంసం చేసి తలపై చెప్పు పెట్టారు. బుధవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో గమనించిన స్థానికులు మంగళవారం రాత్రి దుండగులు ఈ చర్యకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు. మహాత్ముడిని అవమానించిన దుండగులను శిక్షించాలని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్ శివరామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. అఖిలపక్ష నాయకులు నల్ల కండువాలు వేసుకుని రాందాస్ చౌరస్తాలో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అరగంట పాటు ట్రాఫిక్ స్తంభించింది. జాతిపిత మహాత్మా గాంధీని అవమానపరిచిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్ డిమాండ్ చేశారు. అనంతరం అఖిల పక్ష నాయకులు గాంధీ విగ్రహాన్ని శుద్ధి చేసి పూల మాలలు వేశారు. మెదక్ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి మెదక్ పట్టణ ఇన్స్పెక్టర్ మహేష్ చేరుకుని పరిశీలించారు. రాందాస్ చౌరస్తాలో ఉన్న సిసి కెమెరాలను పరిశీలిస్తున్నారు. నాయకులు భూపతి రాజు, రాగి అశోక్, మ్యాడం బాలకృష్ణ, లక్ష్మీనారాయణ గౌడ్, పార్థిప్రనాథ్, పురం వెంకటనారాయణ, లక్ష్మీనారాయణ, మధు,, సాయి పంతులు, నాయిని ప్రసాద్,మేడిశెట్టి శంకర్, కొండ శ్రీనివాస్ తదితరులున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



### ఇరాన్ చరిత్ర

**పహ్లావి రాజవంశం (1925–1979)**

రెజా షా పహ్లావి ఆధునికీకరణకు పెద్దపీట వేశారు. అయితే ప్రజాస్వామ్య లోపాలు మరియు పాశ్చాత్య ప్రభావం కారణంగా అసంతృప్తి పెరిగింది.





# ఉజ్వల భవిష్యత్తుకు స్మార్ట్ ఇంజనీరింగ్ కీలకం

- ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు

**ముద్ర, గచ్చిబౌలి:**

సుస్థిర భవిష్యత్తు నిర్మాణానికి స్మార్ట్ ఇంజనీరింగ్ కీలకమని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు అన్నారు. ప్రతి సంవత్సరం మార్చి 4న జరుపుకునే ప్రపంచ ఇంజనీరింగ్ డే సందర్భంగా గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా కన్వెన్షన్ సెంటర్‌లో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. 2019లో ప్రారంభమైన ప్రపంచ ఇంజనీరింగ్ డేను ఈ సంవత్సరం "స్మార్ట్ ఇంజనీరింగ్ ఫర్ సస్టైనబుల్ ఫ్యూచర్ త్రూ ఇన్నోవేషన్ అండ్ డిజిటలైజేషన్" అనే థీమ్‌తో వరల్డ్ ఫెడరేషన్ ఆఫ్ ఇంజనీరింగ్ ఆర్గనైజేషన్, ఇండోనేషియా ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్, యునెస్కో సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.
ఈ సందర్భంగా డాక్టర్ రామేశ్వర్ రావు మాట్లాడుతూ ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ, పవర్ అండ్ ఎనర్జీ, సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్, మైనింగ్ వంటి విభాగాలు స్మార్ట్ ఇంజనీరింగ్ విధానంలోనే శిక్షణ అందిస్తున్నాయని పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న ఇంజనీర్లు, నాన్ ఇంజనీర్లకు సీనియర్ ఫ్యాకల్టీ ద్వారా నైపుణ్యాలు పెంపొందించే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో క్లీన్ వాటర్ అండ్ శానిటేషన్, ఇండస్ట్రీ-ఇన్నోవేషన్-ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, సస్టైనబుల్ సిటీస్ అండ్ కమ్యూనిటీస్, క్లైమేట్ చేంజ్ వంటి రంగాల్లో స్మార్ట్ ఇంజనీరింగ్ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్, బిల్డింగ్ ఇన్ఫర్మేషన్ మోడలింగ్, పర్యావరణానికి అనుకూలమైన రవాణా వ్యవస్థలు, రిన్యూవబుల్ ఎనర్జీ, గ్రీన్ ఎనర్జీ వంటి సాంకేతికతలు భవిష్యత్తు అభివృద్ధికి దోహదపడుతాయని వివరించారు. డిజిటలైజేషన్, రోబోటిక్స్, ఆటోమేషన్ వల్ల పరిశ్రమల్లో ఉత్పాదకత పెరిగిందన్నారు. వాటర్ రిసోర్సెస్ విభాగాధిపతి ఎం. రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు ప్రపంచ దేశాలు కృషి చేస్తున్నప్పటికీ యుద్ధాలు కొనసాగుతున్న పరిస్థితుల్లో క్లైమేట్ చేంజ్ సమస్యను ఎదుర్కోవడం కష్టమని పేర్కొన్నారు. క్వాలిటీ అండ్ ప్రాడక్టివిటీ విభాగాధిపతి ఈ. రామకిషోర్ మాట్లాడుతూ దేశంలోని మహారత్న, నవరత్న సంస్థల్లో పర్యావరణ పరిరక్షణకు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. మేనేజ్‌మెంట్ టెక్నాలజీ డివిజన్ హెడ్ డాక్టర్ యు.ఎస్. జ్యోతి మాట్లాడుతూ ఇంజనీరింగ్ రంగం నూతన ఆవిష్కరణలకు దారి తీస్తుందని చెప్పారు. మైనింగ్ ఇంజనీర్ సుశీల్ కుమార్ మాట్లాడుతూ ప్రకృతిని విధ్వంసం చేసే హక్కు ఎవరికీ లేదని స్పష్టం చేశారు. ఐటీ విభాగాధిపతి సయ్యద్ అజ్గర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ నిర్మాణానికి ఉపయోగపడాలని, విధ్వంసానికి కాదని అభిప్రాయపడ్డారు. ఎఫ్‌డీపీ హెడ్ పి.సాయికిశోర్ మాట్లాడుతూ తాజా ఇంజనీరింగ్ ఆవిష్కరణలపై అందరికీ అవగాహన ఉండాలని సూచించారు.
ఈ కార్యక్రమంలో సివిల్ ట్రాన్స్‌పోర్టేషన్ హెడ్ డాక్టర్ ఆర్. వెంకట్ రెడ్డి, స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. అశోక్, డీపీసీ హెడ్ డాక్టర్ సాగర్, శ్రీకాంత్, భరత్ తదితరులు మాట్లాడారు. సమావేశంలో కాలేజ్ చీఫ్ ఎస్. లక్ష్మీకాంత రావు, డాక్టర్ పి. రాజారావు సహా పలువురు ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొన్నారు.



# 14న మోడల్ హౌసింగ్ కాలనీ ప్రారంభం

- సీఎం చేతుల మీదుగా అర్హులకు పట్టాలు
- వారం రోజుల్లో పనులు పూర్తి చేయండి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**ముద్ర, హుజూర్ నగర్:**



హుజూర్ నగర్ నియోజకవర్గ కేంద్రంలోని రామస్వామి గుట్టవద్ద 110 ఎకరాల్లో నిర్మించిన మోడల్ హౌసింగ్ కాలనీని ఈ నెల 14 న సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. బుధవారం మోడల్ హౌసింగ్ కాలనీని పరిశీలించారు. అనంతరం ఆయన ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రారంభోత్సవానికి తక్కువ సమయం ఉన్నందునా ఎక్కువ పని గంటలు చేసి అయినా వచ్చే వారంలో అన్ని పనులు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. హుజూర్‌నగర్ సమీపంలోని రామస్వామి గుట్టలో 110 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన ఈ కాలనీలో 2,160 కుటుంబాలకు సింగిల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించనున్నట్లు ఆయన తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తాను గృహనిర్మాణ శాఖామంత్రిగా ఉన్నప్పుడు ఈ ప్రాజెక్ట్‌ను ప్రారంభించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందని ఆరోపించారు. 2023లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ప్రాజెక్ట్ పునరుద్ధరణకు చర్యలు ప్రారంభించినట్లు మంత్రి తెలిపారు. 110 ఎకరాల విస్తీర్ణంలో రూ.125 కోట్ల వ్యయంతో ఈ గృహ కాలనీ నిర్మించబడిందని తెలిపారు. ఈ భూమిని ఎండోమెంట్స్ శాఖ నుంచి పూర్తి మార్కెట్ విలువ చెల్లించి, చట్టబద్ధమైన అన్ని అనుమతులతో ప్రభుత్వమే కొనుగోలు చేసిందని మంత్రి స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపిక పూర్తిగా పారదర్శకంగా జరగాలని అధికారులను ఆదేశించారు. స్థానిక రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ ఆధ్వర్యంలో అధికారుల బృందానికి ఈ బాధ్యత అప్పగించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఉండాలన్నారు. అర్హత లేని వారికి ఈ జాబితాలో పేరు ఉండకూడదని మంత్రి స్పష్టం చేశారు. ప్రారంభోత్సవానికి కాలనీతో పాటు పరిసర ప్రాంతాలను సుందరీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.




# ఓపెన్ఏఐకు చేదు అనుభవం

- 48 గంటల్లో వైదొగిలిన15 లక్షల మంది యూజర్లు

**ముద్ర న్యూస్:**

అమెరికా రక్షణ శాఖలో తమ ఏఐ మోడల్స్ వినియోగానికి ఓపెన్ఏఐ పెంటగాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. కానీ 48 గంటల్లోనే ఆ సంస్థకు చేదు అనుభవం ఎదురైంది. 1.5 మిలియన్‌కు పైగా (15లక్షల మంది) యూజర్లు ఆ సంస్థకు చెందిన ఏఐ చాట్‌బాట్ చాట్‌జీపీటీ నుంచి వైదొలిగినట్లు మీడియా వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై ఆ సంస్థ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. ఆంథ్రోపిక్ క్లాడ్ మోడల్స్‌ను తమ సైన్యం అపరిమితంగా వాడుకునేలా యాక్సెస్ ఇవ్వాలని పెంటగాన్ డిమాండ్ చేసింది. అయితే అది ప్రజాస్వామ్య విధానాలకు విరుద్ధమని ఆంథ్రోపిక్ సీఈఓ డారియో అమోడెయ్ తిరస్కరించారు. ఈ క్రమంలోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆంథ్రోపిక్ సంస్థతో వ్యాపారం చేయబోమని ప్రకటించారు. దీంతో రక్షణ రంగంలో ఏఐని వినియోగించేలా ప్రత్యర్థి సంస్థ అయిన ఓపెన్ఏఐతో పెంటగాన్ ఒప్పందం కుదుర్చుకుంది. మిలటరీ ఆపరేషన్లలో ఏఐ వినియోగానికి మద్దతు ఇవ్వడం పట్ల యూజర్లు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఓపెన్ఏఐని యూజర్లు వీడడంతో పాటు సబ్‌స్క్రిప్షన్‌లను రద్దు చేసుకుంటున్నారు. అంతేకాదు యాప్ స్టోర్ ర్యాంకింగ్‌లో చాట్‌జీపీటీని ఆంథ్రోపిక్ క్లాడ్ అధిగమించింది.

# స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ: చంద్రబాబు

- కంపెనీలను తరిమేసిన వైసీపీ
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**ముద్ర న్యూస్:**



వైసీపీ హయాంలో అనేక కంపెనీలను తరిమేశారని సీఎం చంద్రబాబు ఆరోపించారు. జాకీ, లులు, అమర్‌రాజా, ఫ్రాంక్లిన్, టెంపుల్టన్ కంపెనీలను వెళ్లగొట్టారని తెలిపారు. పెట్టుబడులు, మౌలిక వసతులు, ఉద్యోగాల కల్పన అంశంపై శాసనసభలో సీఎం ప్రసంగించారు.
"వైకాపా హయాంలో ఐదేళ్లలో ఒక్క డీఎస్సీ నిర్వహించలేదు. గత ప్రభుత్వంలో యువత పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లిన పరిస్థితి. ఎవరికీ నైపుణ్యాలను కల్పించలేకపోయారు. 20 లక్షల మంది యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చి దానిపై ఓ కమిటీని కూడా నియమించాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే చిరునామా ఏపీ ఉండేది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఏపీ మారింది. 26 పాలసీలతో వేగంగా పెట్టుబడులకు అనుమతులు ఇస్తున్నాం. పర్యాటకానికి పారిశ్రామిక హోదా ఇచ్చి ప్రోత్సహిస్తున్నాం. 175 నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్కులు కూడా ఏర్పాటు చేస్తున్నాం. అలాగే పారిశ్రామిక ప్రోత్సాహకాలను కూడా రూ.210 కోట్ల మేర విడుదల చేశాం"
"ఇటీవల విశాఖలో నిర్వహించిన పెట్టుబడుల సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. వాటిద్వారా 16 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయి. ఎంఎస్ఎంఈలో 2.48 లక్షల మందికి, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 1.46 లక్షలు, పరిశ్రమల్లో 95 వేలు, ఫుడ్ ప్రాసెసింగ్ 64 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయి. మెగా డీఎస్సీ, పోలీసు కానిస్టేబుళ్లు, ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు 30,500 మందికి వచ్చాయి. మొత్తంగా 6.28 లక్షల మందికి ఉద్యోగాల కల్పన ఇప్పటి వరకూ జరిగింది. అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. విశాఖ, అమరావతి, తిరుపతి ఎకనామిక్ జోన్లతో అభివృద్ధి చేస్తున్నాం. 2047కు 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఏపీ తయారవుతుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు.

# ట్రంప్ కు ఏమైంది.. మెడపై ఆ ఎర్రటి మచ్చల కథేంటి?

**ముద్ర డెస్క్ :**

అగ్రరాజ్యం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆరోగ్యంపై మళ్లీ చర్చ మొదలైంది. ఇటీవల ఆయన మెడపై కనిపించిన ఎర్రటి మచ్చలు.. అంతకు ముందు కాలికి గాయం వంటి ఘటనలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ట్రంప్ ఆరోగ్య పరిస్థితిపై అనేక ఊహాగానాలు చక్కర్లు కొడుతున్నాయి. 79 ఏళ్ల వయసులో దేశాన్ని నడిపిస్తున్న నాయకుడిగా ట్రంప్ ఆరోగ్యం ఎప్పుడూ ప్రజా చర్చల్లో ఉండటం సహజమే. అయితే ఈసారి వైరల్ అయిన ఫొటోలు, వ్యాఖ్యలు రాజకీయ వాతావరణాన్ని మరింత వేడెక్కించాయి.

**వైరల్ అయిన ఫొటోలు.. మొదలైన చర్చ**

ఫిబ్రవరి 19, 2026న వైట్ హౌస్ లోని ఈస్ట్ రూమ్‌లో జరిగిన మెడల్ ఆఫ్ హానర్ ప్రధాన కార్యక్రమంలో ట్రంప్ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తున్న సమయంలో తీసిన క్లోజప్ ఫొటోలలో ఆయన మెడపై ఎర్రటి మచ్చలు కనిపించాయి. ఈ చిత్రాలను సోషల్ మీడియాలో పంచుకోవడంతో పెద్ద చర్చకు దారి తీసింది.
కొంతమంది నెటిజన్లు ట్రంప్ తీవ్రమైన అనారోగ్యంతో బాధపడుతున్నాడని వ్యాఖ్యానిస్తుండగా.. మరికొందరు ఇది సాధారణ స్కిన్ సమస్య మాత్రమేనని అంటున్నారు. ముఖ్యంగా ట్రంప్ గతంలో కూడా చేతులపై గాయాలు, కాలికి వాపు వంటి ఆరోగ్య సమస్యలతో కనిపించడం వల్ల ఈసారి వచ్చిన ఫొటోలు మరింత అనుమానాలకు దారి తీశాయి.

**వైట్‌హౌస్ వివరణ..**

ఈ ఊహాగానాల నేపథ్యంలో వైట్ హౌస్ వైద్యుడు డాక్టర్ షాన్ బార్బరెల్లా స్పందించారు. ట్రంప్ కుడి మెడపై కనిపిస్తున్న ఎర్రటి మచ్చలు తీవ్రమైన వ్యాధి లక్షణాలు కావని ఆయన స్పష్టం చేశారు. చర్మ సంరక్షణ కోసం ఉపయోగించే ఒక ప్రిస్క్రిప్షన్ క్రీమ్ వల్ల తాత్కాలికంగా రాషెస్ వచ్చినట్లు తెలిపారు. ఆ క్రీమ్‌ను ఒక వారం పాటు వాడిన తర్వాత కొన్ని వారాల పాటు చర్మం ఎర్రగా కనిపించడం సహజమని.. ఇది ప్రమాదకరం కాదని వైద్యులు వివరించారు. దీనికి ప్రత్యేకంగా చికిత్స అవసరం కూడా లేదని చెప్పారు. అంటే సోషల్ మీడియాలో వస్తున్న "తీవ్రమైన వ్యాధి" అనే వ్యాఖ్యలకు అధికారికంగా ఎలాంటి ఆధారాలు లేవని వైట్ హౌస్ చెప్పినట్లైంది.

**ట్రంప్ ఆరోగ్య చరిత్ర..**

2025 అక్టోబర్‌లో విడుదలైన ట్రంప్ మెడికల్ మెమో ప్రకారం ఆయన ఆరోగ్యం "ఎక్సెప్షనల్" స్థాయిలో ఉందని పేర్కొన్నారు. వైద్యుల అంచనాల ప్రకారం ఆయన హృదయ వయస్సు సుమారు 65 సంవత్సరాలుగా ఉందని, అంటే అసలు వయసుకంటే దాదాపు 14 సంవత్సరాలు తక్కువగా ఉందని వెల్లడించారు.
అయితే కొన్ని చిన్న ఆరోగ్య సమస్యలు మాత్రం ఉన్నాయని నివేదిక చెబుతోంది. బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) 30.5గా ఉండటం వల్ల కొద్దిగా అధిక బరువు ఉన్నట్లు గుర్తించారు. కొలెస్ట్రాల్ మాత్రం నియంత్రణలోనే ఉందని పేర్కొన్నారు. గతంలో కరోనా వైరస్ బారిన పడి కోలుకోవడం, కాలికి వాపు సమస్య, అప్పుడప్పుడు చేతులపై గాయాలు కనిపించడం వంటి అంశాలు కూడా రికార్డుల్లో ఉన్నాయి.
మార్చి 2025లో చేసిన ఎంఆర్ఐ పరీక్షలు కూడా సాధారణంగానే ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. అదేవిధంగా ట్రంప్ తరచూ గాల్ఫ్ ఆడడం వంటి శారీరక చురుకుదనం కొనసాగిస్తున్నారని కూడా నివేదికలో పేర్కొన్నారు.

**రాజకీయ విమర్శలు.. పారదర్శకత ప్రశ్న**

ట్రంప్ ఆరోగ్యంపై చర్చ మొదలైన ప్రతిసారీ రాజకీయ వాదోపవాదాలు కూడా తలెత్తుతాయి. ముఖ్యంగా డెమోక్రాటిక్ నేతలు ట్రంప్ ఆరోగ్య వివరాలు పూర్తిగా ప్రజలకు వెల్లడించడంలేదని విమర్శిస్తుంటారు. అమెరికా అధ్యక్షుడు వయసు పెరిగే కొద్దీ ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి పారదర్శకత అవసరమని వారు అంటున్నారు. అయితే ట్రంప్ అనుచరులు మాత్రం ఈ విమర్శలను రాజకీయ ప్రచారంగా కొట్టిపారేస్తున్నారు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఫొటోలు ఆధారంగా పెద్ద ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు ప్రచారం చేయడం సరైంది కాదని వారు అంటున్నారు.

**వాస్తవం ఏమిటి?**

ప్రస్తుతం అందుబాటులో ఉన్న అధికారిక సమాచారం ప్రకారం ట్రంప్ ఆరోగ్యంపై తీవ్రమైన ఆందోళనకు కారణం కనిపించడం లేదు. మెడపై కనిపించిన మచ్చలు తాత్కాలిక చర్మ సమస్య మాత్రమేనని వైద్యులు చెబుతున్నారు. అయితే 79 ఏళ్ల వయసులో అగ్రరాజ్యాన్ని నడిపిస్తున్న నాయకుడిగా ట్రంప్ ఆరోగ్యం ఎప్పటికప్పుడు ప్రజల దృష్టిలో ఉండటం సహజమే. ముఖ్యంగా ప్రపంచ రాజకీయాలు ఉద్రిక్తంగా ఉన్న సమయంలో మధ్యప్రాచ్య ఉద్రిక్తతల నేపథ్యంలో ఆయన ప్రతి పబ్లిక్ అప్పియరెన్స్ కూడా చర్చకు దారి తీస్తోంది.
మొత్తానికి ట్రంప్‌కు పెద్ద ఆరోగ్య సమస్య ఉందనే వార్తలకు ఇప్పటివరకు స్పష్టమైన ఆధారాలు లేవు. కానీ ఆయన ఆరోగ్యం మాత్రం అమెరికా రాజకీయాల్లో ఎప్పటికీ చర్చనీయాంశంగానే కొనసాగనుంది.



# కొలికపూడిపై చర్యలు లేవా?

తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాస్ రావు ధిక్కారంపై పొలిటికల్ సర్కిల్స్ లో విస్తృత చర్చ జరుగుతోంది. క్రమశిక్షణకు అతిపెద్ద పీట వేసే తెలుగుదేశం పార్టీలో ఒక నాయకుడు పదేపదే అధిష్ఠానాన్ని ధిక్కరిస్తున్నా, అదుపు చేయలేని పరిస్థితిని ఇప్పుడే చూస్తున్నామని పలువురు నాయకులు అంటున్నారు. ఎమ్మెల్యే కొలికపూడి తీరు వల్ల పార్టీకి నష్టం జరుగుతోందని గుర్తించినా, అధిష్ఠానం చేష్టలుడిగి చూడటం అంతుచిక్కడం లేదని అంటున్నారు. ప్రధానంగా ఎమ్మెల్యే కొలికపూడి వ్యవహారశైలిపై సీఎం చంద్రబాబు సీరియస్ గా ఉన్నారని అంటున్నా, ఆయన మాత్రం తీరు మార్చుకోవడం లేదని అంటున్నారు. దీనివల్ల పార్టీలో ఇలాంటి సంస్కృతి పెరిగిపోయే ప్రమాదం ఉందని సీనియర్లు భయపడుతున్నారు.
ఎమ్మెల్యే కొలికపూడి క్రమశిక్షణా రాహిత్యంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎలాంటి చర్యలు తీసుకోలేని పరిస్థితిలో ఉన్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయాన్ని గమనించే కొలికపూడి టీడీపీ అధిష్ఠానం సహనాన్ని పరీక్షిస్తున్నారని అంటున్నారు. తనపై ఏ చర్యలు తీసుకున్నా పార్టీకే ఇబ్బంది అన్నట్లు కొలికపూడి సంకేతాలు పంపుతున్నట్లు భావిస్తున్నారు. అధిష్ఠానానికి సన్నిహితుడిగా పేరున్న ఎంపీ కేశినేని చిన్నితో బహిరంగ యుద్ధానికి కొలికపూడి సై అంటున్నారు. ఇప్పటికే ఒకసారి ఎంపీ చిన్నితో విభేదాల కారణంగా క్రమశిక్షణ కమిటీ విచారణను ఎదుర్కొన్నారు ఎమ్మెల్యే కొలికపూడి. ఎంపీపై ఆరోపణలకు ఆధారాలు చూపలేదని పార్టీ పెద్దల చీవాట్లు తిన్నారు. ఇక తాజాగా వేలాది మంది సమక్షంలో ఎంపీని అవమానించేలా ఎమ్మెల్యే ప్రవర్తించడం సోషల్ మీడియా వేదికగా చర్చకు దారితీస్తోంది.
పదేపదే క్రమశిక్షణను అతిక్రమిస్తున్నా, అధిష్ఠానం నుంచి చీవాట్లు తింటున్నా ఎమ్మెల్యే తన ప్రవర్తనను మార్చుకోవడం లేదని అంటున్నారు. దీనికి కారణం తాను ఏం చేసినా, అధిష్ఠానం ఏమీ చేయలేదన్న ధీమానే కారణంగా కనిపిస్తోందని అంటున్నారు. అయితే ఈ విషయంలో సీఎం చంద్రబాబు కూడా తప్పు చేస్తున్నారని ఆ పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. 164 మంది ఎమ్మెల్యేలతో ప్రభుత్వాన్ని నడుపుతున్న సీఎం చంద్రబాబు ఒక ఎమ్మెల్యే విషయంలో కఠినంగా వ్యవహరించలేకపోతున్నారని విమర్శలు ఎదుర్కొంటున్నారు. ఒక ఎమ్మెల్యే దూరమైనా ప్రభుత్వానికి వచ్చే నష్టమేమీ లేదుకదా? అంటున్నారు. అయితే కొలికపూడిపై చర్యలు తీసుకునే విషయంలో చంద్రబాబు వ్యూహాత్మకంగానే వ్యవహరిస్తున్నారని పార్టీలోని ఓ వర్గం అభిప్రాయపడుతోంది.
క్రమశిక్షణ ధిక్కారం ద్వారా పదేపదే కవ్విస్తున్న ఎమ్మెల్యే కొలికపూడి విషయంలో ఆచితూచి వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఆలోచిస్తున్నారని అంటున్నారు. ఎమ్మెల్యే కొలికపూడి ఏమైనా రహస్య అజెండాతో పనిచేస్తున్నారా? అనే అనుమానం, ప్రత్యర్థులతో చేతులు కలిపి పార్టీకి నష్టం చేసే వ్యూహంతో కొలికపూడి పని చేస్తున్నారనే అభిప్రాయం ఆయనపై చర్యలు తీసుకోవడంలో జాప్యానికి కారణంగా వ్యాఖ్యానిస్తున్నారు. ఎమ్మెల్యే కొలికపూడిపై వేటు వేసి ఆయనకు స్వేచ్ఛనిస్తే పార్టీకి నష్టం చేసేలా మరింత ఎక్కువగా మాట్లాడొచ్చనే ఆలోచనతోనే చంద్రబాబు కఠినంగా వ్యవహరించడం లేదని అంటున్నారు. అదే సమయంలో కొలికపూడిపై చర్యలు తీసుకుంటే, ప్రత్యర్థులు సామాజిక కోణంలో విమర్శలు చేసే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఈ కారణాల వల్లే వ్యూహాత్మకంగా కొలికపూడిని వదిలేశారని వ్యాఖ్యానిస్తున్నారు.



- కనపర్తి రవి

సమగ్ర సమాచార పత్రిక

# ముద్ర

05.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**ఇరాన్ చరిత్ర**

ఇరాన్ ఇస్లామిక్ విప్లవం (1979)
ఆయతొల్లా ఖోమేనీ నాయకత్వంలో ప్రజలు షా పాలనను కూల్చివేశారు. దీంతో ఇరాన్ ఒక ఇస్లామిక్ రిపబ్లిక్‌గా మారింది.



# యుద్ధం అక్కడ.. సెగ ఇక్కడ!

- మధ్యప్రాచ్య యుద్ధ ప్రభావం భారత్‌పై తీవ్రంగా పడే సూచనలు
- చమురు, గ్యాస్ సరఫరాకు అంతరాయం.. ఇంధన సంక్షోభం భయం
- గల్ఫ్‌లో 80 లక్షల భారతీయుల భవిష్యత్తుపై ఆందోళన
- విదేశీ కరెన్సీ ప్రవాహం తగ్గే ప్రమాదం.. రూపాయి విలువపై ఒత్తిడి
- ఎగుమతులు, దిగుమతులు నిలిచే పరిస్థితి.. ఆర్థిక వ్యవస్థకు షాక్
- అంతర్జాతీయ ఉద్రిక్తతలతో బంగారం, వెండి ధరలకు రెక్కలు



**ముద్ర డెస్క్ :**

అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావం భారత్‌పై కూడా తీవ్రంగా పడే ప్రమాదం కనిపిస్తోంది. ముఖ్యంగా చమురు, గ్యాస్ సరఫరా నుంచి విదేశీ మారకద్రవ్యాల వరకు అనేక రంగాలపై ఈ పరిస్థితి ప్రభావం చూపే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు పెరగడంతో భారత్‌కు వచ్చే అయిల్ దిగుమతులు నిలిచిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. భారతదేశం ఉపయోగించే చమురులో పెద్ద భాగం గల్ఫ్ దేశాల నుంచే వస్తుంది. యుద్ధం కారణంగా సరఫరా అంతరాయం కలిగితే దేశంలో ఇంధన ధరలు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. ఇదే సమయంలో ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ఎగుమతులకు కూడా బ్రేక్ పడే అవకాశం ఉంది. అంతర్జాతీయ రవాణా వ్యవస్థ దెబ్బతింటే భారత కంపెనీల ఎగుమతులు నిలిచిపోవచ్చు. దీంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది. అత్యంత కీలకమైన అంశం ఖతార్ నుంచి వచ్చే సహజ వాయువు (ఎల్ఎన్జీ) సరఫరా తగ్గిపోవడం. భారత్‌కు అవసరమైన గ్యాస్‌లో గణనీయమైన భాగం ఖతార్ నుంచే వస్తుంది. సరఫరా ఆగిపోతే విద్యుత్ ఉత్పత్తి నుంచి పరిశ్రమల వరకు అనేక రంగాలు దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుంది. ఇంకా గల్ఫ్ దేశాల్లో పనిచేస్తున్న సుమారు 80 లక్షల మంది భారతీయుల భవిష్యత్తు కూడా అనిశ్చితంగా మారే ప్రమాదం ఉంది. అక్కడి పరిస్థితులు దిగజారితే వారు భారత్‌కు పంపే విదేశీ కరెన్సీ (రెమిటెన్సులు) తగ్గిపోవచ్చు. ఇది దేశ విదేశీ మారక నిల్వలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఈ పరిణామాల నేపథ్యంలో రూపాయి విలువ కూడా భారీగా పడిపోవచ్చని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఎగుమతులు, దిగుమతులు నిలిచిపోతే ఫారిన్ కరెన్సీ ప్రవాహం తగ్గిపోతుంది. ఇప్పటికే డాలర్‌తో పోలిస్తే రూపాయి బలహీనంగా మారే సూచనలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే అంతర్జాతీయ అస్థిరత కారణంగా బంగారం, వెండి ధరలు భారీగా పెరిగే అవకాశం ఉంది. యుద్ధ పరిస్థితుల్లో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తులైన బంగారంపై ఎక్కువగా మొగ్గు చూపుతారు. దీంతో దేశీయ మార్కెట్లో కూడా బంగారం ధరలు రికార్డు స్థాయికి చేరే అవకాశముందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మొత్తం మీద యుద్ధం మరింత తీవ్రరూపం దాల్చితే ఇంధనం నుంచి కరెన్సీ వరకు అనేక రంగాల్లో భారత్‌కు పెద్ద సవాళ్లు ఎదురయ్యే పరిస్థితి కనిపిస్తోంది.



## శ్రీ రంగనాథ స్వామి రథోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

**ముద్ర పెబ్బేరు :**

శ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, వనపర్తి రాజవంశీయులు రాజా కృష్ణదేవరావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో నుంచి పల్లకిలో ఊరేగింపుగా రథం వద్దకు చేర్చారు. రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామివారి రథాన్ని లాగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరంగాపురం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని, ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని రూ. 5 కోట్లతో టూరిజం హబ్‌గా మార్చనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. రూ. 2 కోట్ల రూపాయలతో ఆలయానికి సంబంధించిన ప్రధాన రహదారిని బాగు చేయనున్నట్లు తెలిపారు. ఒక కోటి 50 లక్షల రూపాయలతో అతిథి గృహాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. రూ. 24 కోట్ల రూపాయలతో నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో శ్రీ రంగనాయక సముద్ర వెనకాల ఉన్న పంట పొలాలలోని కాలువలను బలోపేతం చేసేందుకు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిలేటి వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, శ్రీరంగపురం మండల నాయకులు శ్రీహరి రాజు, బీరం రాజశేఖర్ రెడ్డి, పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## హోలీ ఈవెంట్ పేరుతో మోసం

### నిర్వాహకుడిపై కేసు నమోదు

**ముద్ర, కూకట్‌పల్లి :**

రంగుల పండుగ హోలీ సందర్భంగా నగరంలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఈవెంట్ పేరుతో సామాన్య ప్రజలను మోసం చేసిన నిర్వాహకుడిపై కూకట్‌పల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైతలాపూర్ గ్రౌండ్స్‌లో "రాధాకృష్ణ ఉత్సవ్ 2.0" పేరుతో హోలీ వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఎన్. సాయి కుమార్ తండ్రి అంజయ్య సోషల్ మీడియా, బుక్‌మైషో ద్వారా ప్రచారం చేశారు. మార్చి 4న ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో ప్రముఖ 'రాధాకృష్ణ' సీరియల్ నటీనటులు పాల్గొంటారని, టికెట్ కొనుగోలు చేసిన వారికి భోజన సదుపాయం కల్పిస్తామని నమ్మబలికారు. దీనిని నమ్మిన శీలా అర్జున్ తన స్నేహితులతో కలిసి మొత్తం రూ.7,446 చెల్లించి టికెట్లు కొనుగోలు చేశారు. అయితే అక్కడికి వెళ్లిన తరువాత ప్రకటనలో పేర్కొన్న విధంగా సీరియల్ నటీనటులు రాకపోవడంతోపాటు భోజన ఏర్పాట్లు కూడా లేవని గుర్తించారు. తమను మోసం చేసినట్లు భావించిన బాధితుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును ఎస్ఐ కె. గిరీష్ కుమార్ పర్యవేక్షిస్తున్నారు. ఈవెంట్ల పేరుతో జరిగే ఇటువంటి మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. బాధితులు ఎవరైనా ఉంటే పోలీసులను సంప్రదించాలని కోరారు.

## డ్రగ్స్ రాకెట్ గుట్టు రట్టు



- మాదకద్రవ్యాల స్థావరాలపై దాడులు
- రూ.22 లక్షల విలువైన డ్రగ్స్ పట్టివేత
- ముగ్గురు విదేశీయులతో సహా ఆరుగురు అరెస్ట్


**ముద్ర ప్రతినిధి, రాజేంద్రనగర్ :**

విద్యార్థి వీసాల పేరుతో దేశానికి వచ్చి డ్రగ్స్ విక్రయిస్తున్న వేర్వేరు దేశాలకు చెందిన ఇద్దరు విదేశీయులను రాజేంద్రనగర్ పోలీసులు అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువైన ఎమ్‌డీఎమ్ఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్ వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. యెమెన్ దేశానికి చెందిన అల్ ఆక్వార్ అబ్దురాబు 2008లో పర్యాటక వీసాతో భారతదేశానికి మొదటిసారి వచ్చాడు. అనంతరం 2009, 2011, 2012లో విద్యార్థి వీసాలతో మళ్లీ వచ్చి, 2015, 2016లో వీసా గడువును 16 ఏప్రిల్ 2020 వరకు పొడిగించుకున్నాడు. కర్ణాటక, హైదరాబాద్‌లలో జేఎన్‌టీయూలో విద్య కోసం చేరి మధ్యలోనే చదువులు మానేశాడు. డ్రగ్స్‌కు అలవాటు పడ్డ అతను సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో డ్రగ్స్ సరఫరా చేస్తూ బెంగళూరు, హైదరాబాద్‌లలో పలుమార్లు పోలీసులకు చిక్కాడు. ఢిల్లీలో పాలస్తీనా దేశానికి చెందిన అలీ మొహమ్మద్ అల్ కఫి ద్వారా నైజీరియన్ డ్రగ్స్ సరఫరాదారు చిడిను పరిచయం చేసుకున్నాడు. అతనికి నగరంలో ఎనిమిది నెలలు ఆశ్రయం కల్పించాడు. 8 జనవరి 2026న టోలిచౌకి పోలీసుల సహకారంతో నాంపల్లి ఎక్సైజ్ పోలీసులు చిడిను అరెస్టు చేశారు. అనంతరం మరో నైజీరియన్ ద్వారా బెంగళూరులో అబ్దురాబుకు గాజాకు చెందిన హసన్‌తో పరిచయం ఏర్పడింది. హసన్ 2016లో మొదటిసారి భారతదేశానికి వచ్చి కర్ణాటక కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ సైన్స్‌లో బీసీఏ కోర్సులో చేరాడు. కోవిడ్ సమయంలో స్వదేశానికి వెళ్లి టర్కీ నుంచి ఆన్‌లైన్‌లో తన కోర్సు పూర్తి చేశాడు. 2022లో వ్యాపార వీసాతో మళ్లీ దేశానికి రాగా నవంబరులో ఎలంక పోలీసులు అతన్ని అరెస్టు చేశారు. 2024 నుంచి లూడో గేమ్ కంటెంట్ క్రియేటర్‌గా పనిచేస్తున్నాడు. బెంగళూరులో అబ్దురాబు, హసన్ కలిసి దేశంలోని వివిధ ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయాలకు బ్రాంచ్‌లు ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పక్కా సమాచారం ఆధారంగా రాజేంద్రనగర్ పోలీసులు, మాదకద్రవ్యాల నివారణ సంస్థ సంయుక్తంగా అబ్దురాబు, హసన్‌లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.25 లక్షల విలువైన 150 గ్రాముల ఎమ్‌డీఎమ్ఏ డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థి వీసాలపై వచ్చిన వీరిపై పలు డ్రగ్స్ కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. హసన్ ఏడు నెలల జైలు శిక్ష అనుభవించి బెయిల్‌పై విడుదలైనట్లు పేర్కొన్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

## అమెరికా దాడి.. భారత్ తీరాన యుద్ధ మబ్బులు..

**ముద్ర డెస్క్ :**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఇరాన్‌అమెరికా, ఇజ్రాయెల్ మధ్య యుద్ధ ఉద్రిక్తతలు ఇప్పుడు హిందూ మహాసముద్రం వరకు విస్తరించినట్లుగా కనిపిస్తున్నాయి. శ్రీలంక తీరానికి సమీపంలో ఇరాన్ యుద్ధనౌక మునిగిపోవడం సాధారణ నౌకా ప్రమాదం కాదు. అమెరికా జలాంతర్గామి ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగిందని స్వయంగా అమెరికా రక్షణ శాఖ ప్రకటించడం అంతర్జాతీయ రాజకీయాల్లో తీవ్రమైన చర్చకు దారి తీస్తోంది. ముఖ్యంగా ఈ ఘటన భారత్‌కు సమీప సముద్ర ప్రాంతంలో జరగడం మరింత ఆందోళన కలిగించే అంశం. ఈ సంఘటనలో రెండు కీలక అంశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. మొదటిదిపశ్చిమాసియా యుద్ధం భౌగోళికంగా విస్తరిస్తోంది. రెండవది హిందూ మహాసముద్రం కూడా ఇప్పుడు వ్యూహాత్మక పోరాట వేదికగా మారుతోంది. విశాఖపట్నంలో జరిగిన అంతర్జాతీయ నౌకాదళ విన్యాసంలో పాల్గొని తిరుగు ప్రయాణంలో ఉన్న ఇరాన్ నౌకపై అమెరికా జలాంతర్గామి దాడి జరగడం యాదృచ్ఛికం కాదు. ఇది అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో కూడా సైనిక ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని సూచిస్తోంది. భారత్ దృష్టిలో ఈ పరిణామం అత్యంత సున్నితమైనది. ఎందుకంటే భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి మద్దతు ఇచ్చే దేశంగా నిలుస్తోంది. ఈ ప్రాంతం అంతర్జాతీయ వాణిజ్యానికి కీలకం. ప్రపంచ చమురు రవాణాలో పెద్ద భాగం ఈ మార్గాల ద్వారానే జరుగుతుంది. ఇలాంటి ప్రాంతంలో యుద్ధ సంబంధిత చర్యలు జరగడం వాణిజ్య రవాణా, భద్రతపై ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఇంకా ఒక ముఖ్యమైన కోణం భారత భద్రత. శ్రీలంక తీరానికి సమీపంలో జరిగిన ఈ ఘటన భారత్ సముద్ర సరిహద్దులకు పెద్దగా దూరంలో లేదు. ఇలాంటి పరిణామాలు కొనసాగితే భారత నౌకాదళం మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. అదే సమయంలో భారత్ తటస్థ దౌత్య విధానాన్ని కొనసాగిస్తూ శాంతి పరిరక్షణకు ప్రయత్నించడం అత్యవసరం. మొత్తంగా చూస్తే ఈ ఘటన ఒక సాధారణ నౌక ప్రమాదం కాదు. ఇది ప్రపంచ రాజకీయాల్లో పెరుగుతున్న ఉద్రిక్తతలకు సంకేతం. యుద్ధం భూభాగాలకే పరిమితం కాకుండా సముద్ర మార్గాల వరకు విస్తరించే ప్రమాదం ఉందని ఈ సంఘటన స్పష్టం చేస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అంతర్జాతీయ సమాజం యుద్ధాన్ని విస్తరించకుండా నియంత్రించేందుకు దౌత్యపరమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం అత్యంత కీలకం.



# బెంగళూరు స్టార్టప్ వ్యథలు

- రూ. 92 లక్షల జీతం.. అయినా దక్కని ఉద్యోగ భద్రత..!

**ముద్ర డెస్క్ :**

భారతదేశ సిలికాన్ వ్యాలీగా పిలవబడే బెంగళూరు నగరం ఒకప్పుడు కలల సౌధాలకు నిలయం. లక్షల రూపాయల ప్యాకేజీలు, అత్యాధునిక ఆఫీస్ సౌకర్యాలు, వేగవంతమైన వృద్ధి.. ఇవన్నీ యువ టెక్కీలను అయస్కాంతంలా ఆకర్షించేవి. కానీ నేడు అదే నగరం నుంచి వస్తున్న వార్తలు స్టార్టప్ ప్రపంచంలోని చీకటి కోణాన్ని ఆవిష్కరిస్తున్నాయి. తాజాగా ఒక స్టార్టప్ సంస్థలో జరిగిన సామూహిక తొలగింపులు.. ముఖ్యంగా రూ. 92 లక్షల వార్షిక వేతనం ఉన్న వ్యక్తి కూడా నిరుద్యోగిగా మారడం పారిశ్రామిక వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీసింది.

**- అధిక వేతనం.. అల్ప భద్రత.. ఒక వైరుధ్యం..**

సాధారణంగా మధ్యతరగతి ఆలోచనా ధోరణిలో ఒక భావన బలంగా ఉంటుంది. ఎక్కువ జీతం ఉంటే ఆ ఉద్యోగి సంస్థకు అత్యంత అవసరమైన వ్యక్తి అని.. వారికి భద్రత ఎక్కువగా ఉంటుందని.. కానీ ప్రస్తుత స్టార్టప్ సంస్కృతి ఈ సూత్రాన్ని తలకిందులు చేసింది. చార్టర్డ్ అకౌంటెంట్ అర్పిత్ గోయల్ వెల్లడించిన వివరాల ప్రకారం.. సదరు కంపెనీ తన మొత్తం సిబ్బందిలో 40 శాతం మందిని ఒక్క రోజులోనే తొలగించింది. ఇందులో రూ. 92 లక్షల భారీ ప్యాకేజీ తీసుకుంటున్న సీనియర్ ఉద్యోగులు కూడా ఉండటం గమనార్హం. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే కంపెనీలు వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టినప్పుడు మొదటగా వేటు పడేది భారీ జీతాలు తీసుకునే వారిపైనే. ఒక సీనియర్ ఉద్యోగిని తొలగించడం ద్వారా కంపెనీకి మిగిలే బడ్జెట్, నలుగురు జూనియర్ల జీతంతో సమానం కావచ్చు. ఫలితంగా అనుభవం, ప్రతిభ ఉన్నప్పటికీ, ఆర్థిక లెక్కల ముందు మానవ వనరులు కేవలం 'సంఖ్యలు'గానే మిగిలిపోతున్నాయి.




**- మానవీయ కోణం మృగ్యం..**

ఈ తొలగింపుల ప్రక్రియలో అత్యంత విచారకరమైన అంశం ఏమిటంటే సంస్థలు ఉద్యోగుల వ్యక్తిగత పరిస్థితులను ఏమాత్రం పరిగణనలోకి తీసుకోకపోవడం... ఒక ఉద్యోగి తండ్రి కావడానికి కేవలం కొన్ని రోజుల సమయం ఉండగా ఉద్వాసనకు గురయ్యాడు. మరో ఉద్యోగిని గర్భవతి అని తెలిసి కూడా, మేటర్నిటీ లీవ్ దరఖాస్తు చేసుకునే లోపే తొలగించారు. ఇలాంటి చర్యలు కార్పొరేట్ ప్రపంచంలో మానవీయ విలువలు ఏ స్థాయిలో పతనమవుతున్నాయో సూచిస్తున్నాయి. కేవలం లాభనష్టాల బేరీజులో పడి.. ఒక మనిషి జీవితాన్ని వారి కుటుంబ భవిష్యత్తును రోడ్డున పడేయడం సమర్థనీయం కాదు. ఇది కేవలం ఆర్థిక సంక్షోభం మాత్రమే కాదు.. నైతిక సంక్షోభం కూడా.

**స్టార్టప్ బుడగ పగిలిపోతోందా?..**

గత కొన్నేళ్లుగా 'ఫండింగ్ వింటర్' అనే పెట్టుబడుల కొరత స్టార్టప్ రంగాన్ని వెంటాడుతోంది. ఇన్వెస్టర్ల నుంచి ఒత్తిడి పెరగడం, తక్షణ లాభాలను ఆశించడం వంటి కారణాలతో కంపెనీలు అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటున్నాయి. నిన్నటి వరకు ఆకాశమే హద్దుగా ఎగిరిన స్టార్టప్‌లు నేడు నేల చూపులు చూస్తున్నాయి. వ్యాపార నమూనాలో లోపాలు, మార్కెట్ అనిశ్చితి మధ్య ఉద్యోగులు బలిపశువులుగా మారుతున్నారు.

**ఉద్యోగులు నేర్చుకోవాల్సిన పాఠం..**

ఈ బెంగళూరు ఘటన ఐటీ, స్టార్టప్ రంగాల్లో ఉన్న వారందరికీ ఒక మేలుకొలుపు. ప్రస్తుత కాలంలో ఏ ఉద్యోగమూ శాశ్వతం కాదు.. ఏ ప్యాకేజీ కూడా భద్రతకు గ్యారెంటీ ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో ప్రతి ఉద్యోగి కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం తప్పనిసరి.. మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా నిరంతరం కొత్త విషయాలు నేర్చుకుంటూ ఉండాలి. కనీసం ఆరు నెలల నుండి ఏడాది పాటు జీతం లేకపోయినా ఇల్లు గడిచేలా 'ఎమర్జెన్సీ ఫండ్' ఏర్పాటు చేసుకోవాలి. ఒకే ఆదాయ వనరుపై ఆధారపడకుండా ఉండటం శ్రేయస్కరం. కంపెనీలు కూడా తమ బ్రాండ్ విలువ కేవలం లాభాల మీదనే కాకుండా ఉద్యోగుల పట్ల చూపే గౌరవం మీద కూడా ఆధారపడి ఉంటుందని గుర్తించాలి. ప్రతిభావంతులైన ఉద్యోగులే ఏ సంస్థకైనా అసలైన ఆస్తులు. వారిని కష్టకాలంలో ఆదుకోలేనప్పుడు, సదరు సంస్థ ఎంతటి గొప్ప సాంకేతికతను కలిగి ఉన్నా అది విఫలమైనట్టే లెక్క.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
05.03.2026 గురువారం, హైదరాబాద్



## ఇరాన్ చరిత్ర

ఇరాన్–ఇరాక్ యుద్ధం (1980–1988) సద్దాం హుస్సేన్ నేతృత్వంలోని ఇరాక్ ఇరాన్‌పై దాడి చేయడంతో ఎనిమిదేళ్లు యుద్ధం జరిగింది. ఈ యుద్ధంలో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోయారు.



# భారత్–ఇంగ్లాండ్ పోరులో అత్యధిక పరుగులు చేసిన టాప్–5 ఆటగాళ్లు

టీ20 ప్రపంచకప్ 2026 రెండో సెమీఫైనల్‌లో మార్చి 5న ముంబై వాంఖడే స్టేడియంలో భారత్, ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి. ఈ నేపథ్యంలో ఇరు జట్ల మధ్య టీ20 అంతర్జాతీయాల్లో అత్యధిక పరుగులు చేసిన ప్రముఖ ఆటగాళ్లపై ఆసక్తి నెలకొంది. ఇంగ్లాండ్ వెటరన్ జోస్ బట్లర్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉన్నాడు. భారత్‌పై 27 టీ20 మ్యాచ్‌లు ఆడిన అతను 32.20 సగటుతో 644 పరుగులు సాధించాడు. ఇందులో ఐదు అర్ధశతకాలు ఉన్నాయి. భారత్ తరపున హార్దిక్ పాండ్యా రెండో స్థానంలో నిలిచాడు. ఇంగ్లాండ్‌పై 20 మ్యాచ్‌ల్లో 29.57 సగటుతో 414 పరుగులు చేసి మూడు అర్ధశతకాలు నమోదు చేశాడు. సూర్యకుమార్ యాదవ్ ఇంగ్లాండ్‌తో 13 మ్యాచ్‌లు ఆడి 29.08 సగటుతో 349 పరుగులు సాధించాడు. ఈ క్రమంలో ఒక సెంచరీ, ఒక అర్ధశతకం నమోదు చేశాడు. అభిషేక్ శర్మ ఇంగ్లాండ్‌పై ఐదు మ్యాచ్‌ల్లోనే 55.80 సగటుతో 279 పరుగులు చేసి మెరుగైన రికార్డు నమోదు చేశాడు. ఇందులో ఒక శతకం, ఒక అర్ధశతకం ఉన్నాయి. ఇంగ్లాండ్ కెప్టెన్ హ్యారీ బ్రూక్ భారత్‌పై 10 మ్యాచ్‌లు ఆడి 171 పరుగులు మాత్రమే సాధించాడు. అతని సగటు 19 కాగా, ఒక అర్ధశతకం నమోదు చేశాడు. సెమీఫైనల్ వంటి కీలక దశలో ఈ ఆటగాళ్ల ప్రదర్శన మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేసే అవకాశం ఉంది.



# సెమీఫైనల్ లో హార్దిక్ పాండ్యా రికార్డు క్రియేట్ చేస్తాడా?

టీ20 ప్రపంచకప్ 2026 సెమీఫైనల్‌లో భారత్, ఇంగ్లాండ్ జట్లు ముంబై వాంఖడే స్టేడియంలో తలపడనున్నాయి. ఫైనల్ ప్రవేశం కోసం ఇరు జట్లు గట్టి పోటీకి సిద్ధమవుతున్నాయి. ఈ కీలక మ్యాచ్‌లో టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యాకు ప్రత్యేక రికార్డు సాధించే అవకాశం ఉంది. టీ20 అంతర్జాతీయాల్లో భారత్ తరపున అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో హార్దిక్ ప్రస్తుతం ఐదో స్థానంలో ఉన్నాడు. అతను 136 మ్యాచ్‌ల్లో 2243 పరుగులు సాధించగా, కేఎల్ రాహుల్ 2265 పరుగులతో నాలుగో స్థానంలో ఉన్నాడు. సెమీఫైనల్‌లో హార్దిక్ 23 పరుగులు చేస్తే రాహుల్‌ను అధిగమిస్తాడు. ఈ ఫార్మాట్‌లో భారత్‌కు అత్యధిక పరుగులు చేసిన రికార్డు రోహిత్ శర్మ పేరిట ఉంది. అతను 159 మ్యాచ్‌ల్లో 4231 పరుగులు చేశాడు. రెండో స్థానంలో విరాట్ కోహ్లీ (4188), మూడో స్థానంలో సూర్యకుమార్ యాదవ్ (3261) కొనసాగుతున్నారు. ప్రస్తుత టోర్నీలో హార్దిక్ బంతితోనూ, బ్యాటింగ్‌లోనూ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏడు మ్యాచ్‌ల్లో ఆరు వికెట్లు తీసి, రెండు అర్ధశతకాలు సాధించాడు. సెమీఫైనల్‌లో అతని ప్రదర్శన జట్టు విజయావకాశాలను ప్రభావితం చేయనుంది.

# బాబర్ అజామ్‌కు షాక్.. బంగ్లాదేశ్ వన్డే సిరీస్‌కు దూరం

పాకిస్తాన్ క్రికెట్‌లో కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. టీ20 ప్రపంచకప్ 2026లో నిరాశపరిచిన ప్రదర్శన తర్వాత స్టార్ బ్యాట్స్‌మన్ బాబర్ అజామ్‌ను బంగ్లాదేశ్‌తో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేయలేదు. మార్చి 11 నుంచి ప్రారంభమయ్యే మూడు వన్డేల సిరీస్ కోసం పాకిస్తాన్ 15 మంది సభ్యుల జట్టును ప్రకటించింది. భవిష్యత్ జట్టును దృష్టిలో ఉంచుకుని సెలక్టర్లు ఆరుగురు కొత్త ఆటగాళ్లకు అవకాశం ఇచ్చారు. అబ్దుల్ సమద్, మాజ్ సదాఖత్, మహ్మద్ ఘాజీ ఘోరీ, సాద్ మసూద్, సాహిబ్జాదా ఫర్హాన్, షమీల్ హుస్సేన్ జట్టులో చోటు దక్కించుకున్నారు. అనుభవజ్ఞులైన ఫకార్ జమాన్, సామ్ అయూబ్‌లకు కూడా అవకాశం లభించలేదు. ఫాస్ట్ బౌలర్ షాహీన్ షా అఫ్రిది జట్టుకు కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. మహ్మద్ రిజ్వాన్, హారిస్ రవూఫ్, సల్మాన్ అలీ ఆఘా వంటి సీనియర్ ఆటగాళ్లు జట్టులో ఉన్నారు. టీ20 ప్రపంచకప్‌లో సెమీఫైనల్ చేరుకోలేకపోయిన నేపథ్యంలో ప్రతి ఆటగాడికి రూ.15 లక్షల జరిమానా విధించినట్లు పీసీబీ తెలిపింది.



# దిగ్గజ క్రికెటర్ల సరసన చేరనున్న బుమ్రా

టీ20 ప్రపంచకప్ 2026 రెండో సెమీఫైనల్‌లో మార్చి 5న భారత్-ఇంగ్లాండ్ జట్లు ముంబై వాంఖడే స్టేడియంలో తలపడనున్నాయి. ఫైనల్ ప్రవేశం కోసం జరిగే ఈ కీలక పోరులో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా అరుదైన ఘనత సాధించే అంచున ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో ఒక్క వికెట్ సాధిస్తే అంతర్జాతీయ క్రికెట్‌లో 500 వికెట్ల మైలురాయిని చేరుకుంటాడు. ఈ ఘనతను ఇప్పటివరకు కేవలం ఏడుగురు భారత బౌలర్లు మాత్రమే అందుకున్నారు. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరపున అత్యధిక వికెట్లు సాధించిన బౌలర్ అనిల్ కుంబ్లే. ఆయన 403 మ్యాచ్‌ల్లో 956 వికెట్లు తీశారు. రవిచంద్రన్ అశ్విన్ 765 వికెట్లతో రెండో స్థానంలో ఉండగా, హర్భజన్ సింగ్ 717 వికెట్లు సాధించాడు. కపిల్ దేవ్ 687 వికెట్లు నమోదు చేశాడు. రవీంద్ర జడేజా 634 వికెట్లు, జహీర్ ఖాన్ 610 వికెట్లు, జవగల్ శ్రీనాథ్ 551 వికెట్లు సాధించారు. ఇప్పుడు బుమ్రా కూడా ఈ దిగ్గజాల సరసన చేరుతాడా అన్నది ఆసక్తికరంగా మారింది. సెమీఫైనల్‌లో అతని ప్రదర్శన జట్టు విజయానికి కీలకంగా ఉండనుంది.



## సెమీఫైనల్‌లో బుమ్రానే కీలకం: మహ్మద్ కైఫ్



టీ20 ప్రపంచకప్ 2026 ఫైనల్‌కు ఏ రెండు జట్లు చేరతాయన్న ఉత్కంఠ నెలకొంది. తొలి సెమీఫైనల్‌లో దక్షిణాఫ్రికా-న్యూజిలాండ్ పోటీ పడుతుండగా, రెండో సెమీఫైనల్‌లో మార్చి 5న ముంబై వాంఖడే స్టేడియంలో భారత్-ఇంగ్లాండ్ జట్లు తలపడనున్నాయి.ఈ మ్యాచ్‌లో భారత పేసర్ జస్ప్రీత్ బుమ్రా పాత్ర అత్యంత కీలకమని మాజీ క్రికెటర్ మహ్మద్ కైఫ్ అభిప్రాయపడ్డాడు. తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన ఆయన, బుమ్రా నాలుగు ఓవర్లు మ్యాచ్ ఫలితాన్ని ప్రభావితం చేయగలవని పేర్కొన్నాడు. ఇంగ్లాండ్‌పై బుమ్రా గణాంకాలు కూడా బలంగా ఉన్నాయని వెల్లడించాడు. ఇంగ్లాండ్‌తో ఐదు టీ20లు ఆడిన బుమ్రా తొమ్మిది వికెట్లు తీసి, 9.11 సగటు, 5.34 ఎకానమీ నమోదు చేశాడు. వాంఖడే పిచ్‌పై కూడా కైఫ్ స్పందించాడు. సాధారణంగా టాస్ గెలిచిన జట్టు ముందుగా బౌలింగ్ ఎంచుకునే విధానం ఉన్నప్పటికీ, ఈ మ్యాచ్‌లో ఆ వ్యూహం మారవచ్చని సూచించాడు. రెండో ఇన్నింగ్స్‌లో మంచు ప్రభావం తక్కువగా ఉండే అవకాశం ఉందని అభిప్రాయపడ్డాడు.


సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
05.03.2026 గురువారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews





## సిల్క్ సారీలో కవ్విస్తున్న త్రిప్తి

సినీ ప్రేక్షకులను తన అందం, అభినయంతో ఆకట్టుకుంటున్న త్రిప్తి దిమ్రి తాజాగా సిల్క్ చీరలో మెరిసి అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సాధారణంగా గ్లామరస్ పాత్రల్లో కనిపించే ఆమె, ఈసారి సంప్రదాయ వేషధారణలోనూ అదే స్థాయి ఆకర్షణను ప్రదర్శించింది. సిల్క్ సారి మెరుపు ఆమె వ్యక్తిత్వానికి మరింత నిండుదనం తీసుకువచ్చింది. గాఢమైన రంగులో ఉన్న ఆ సిల్క్ చీర ఆమెకు అద్భుతంగా సరిపోయింది. చీర మృదువుగా జారిపడే తీరు ఆమె శరీర ఆకృతిని అందంగా హైలైట్ చేసింది. దీనికి జతగా ధరించిన నాజూకైన ఆభరణాలు మొత్తం లుక్‌కు మరింత అందాన్ని జోడించాయి. సంప్రదాయ సోయగం, ఆధునిక మెరుపు కలగలిపిన ఈ రూపం అభిమానులను మంత్రముగ్ధులను చేస్తోంది. ప్రత్యేకంగా ఆమె హావభావాలు, ఆత్మవిశ్వాసం ఈ లుక్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. సిల్క్ సారీలోనూ గ్లామర్‌ను ఎలా మెరిపించాలో త్రిప్తి మరోసారి నిరూపించింది. ప్రతి సారి కొత్తదనం కోసం ప్రయత్నించే ఆమె, ఈసారి కూడా ఫ్యాషన్ ప్రేమికుల ప్రశంసలు అందుకుంటోంది.





## ‘ఉస్తాద్ భగత్ సింగ్’కు మ్యూజిక్ మార్పు?

పవన్ కళ్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న ‘ఉస్తాద్ భగత్ సింగ్’పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, పవన్ లుక్ సినిమాపై ఆసక్తిని పెంచాయి. తాజాగా ఈ చిత్రానికి బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించే బాధ్యతల నుంచి దేవిశ్రీ ప్రసాద్ తప్పుకున్నారని, ఆయన స్థానంలో ఎస్.ఎస్.తమన్ చేరారని ఫిల్మ్ నగర్‌లో ప్రచారం జరుగుతోంది. గతంలో ‘పుష్ప 2’ విషయంలోనూ మ్యూజిక్ మార్పులు చర్చనీయాంశమయ్యాయి. అయితే ఈ అంశంపై చిత్ర యూనిట్ నుంచి అధికారిక ప్రకటన వెలువడలేదు. మార్చి 19న విడుదలకు సన్నాహాలు జరుగుతున్న ఈ చిత్రానికి మ్యూజిక్ మార్పు నిజమేనా అన్నదానిపై త్వరలో స్పష్టత రానుంది.

## అసభ్య వ్యాఖ్యలు.. అత్యాచార బెదిరింపులు..

**సోషల్ మీడియా వేధింపులపై అయేషా ఖాన్ ఆవేదన**

సోషల్ మీడియాలో ఏదైనా పోస్టు చేయాలంటే వందసార్లు ఆలోచించాల్సి వస్తోందని నటి అయేషా ఖాన్ వెల్లడించింది. కామెంట్ బాక్స్‌లో వచ్చే అసభ్యకర వ్యాఖ్యలు తనను తీవ్రంగా కలచివేస్తున్నాయని తెలిపింది. ‘వీ ది ఉమెన్’ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె, నెట్టింట తనపై జరుగుతున్న శరీర అవమానాలు, అత్యాచార బెదిరింపులపై స్పందించింది. తాను సాధారణ దుస్తులు ధరించినా ప్రజలు ఎలా స్పందిస్తారోనన్న ఆందోళన ఉంటుందని పేర్కొంది. అందుకే ఏదైనా ఫోటోను పంచుకోవాలంటే ముందుగా ఎన్నోసార్లు ఆలోచించి నిర్ణయం తీసుకుంటానని చెప్పింది. కొన్ని సందర్భాల్లో పోస్టులకు వచ్చే వ్యాఖ్యలు చూసి సామాజిక మాధ్యమాల్లో ఏదైనా పంచుకోవడానికే వెనుకడుగు వేస్తానని వెల్లడించింది. ప్రతిరోజూ అత్యాచార బెదిరింపులు వస్తున్నాయని, తనపై నీచంగా వ్యాఖ్యలు చేస్తున్నారని తెలిపింది. తాను ప్రముఖురాలు కాకపోతే ఆ బెదిరింపులు నిజమయ్యేవేమోనన్న భయం కలుగుతోందని పేర్కొంది. ఇవి కేవలం వ్యాఖ్యలు కాదని, తన వ్యక్తిగత భద్రతకు సంబంధించిన అంశమని స్పష్టం చేసింది. ఇలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసింది.






## కొత్త కోడలిని జాగ్రత్తగా చూసుకోండి: విజయ్ దేవరకొండ

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న వివాహ వేడుకలు వైభవంగా కొనసాగుతున్నాయి. రిసెప్షన్‌కు ముందు ఈ జంట మీడియాను కలిసింది. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు కొత్త కోడలు వచ్చిందని, ఆమెను అందరూ జాగ్రత్తగా చూసుకోవాలని వ్యాఖ్యానించాడు. తమ సినీ ప్రయాణంలో మీడియా కీలక భాగమని, ఇప్పుడు జంటగా ముందుకు రావడం ప్రత్యేక అనుభూతి కలిగిస్తోందని తెలిపాడు. రష్మిక కూడా జీవితంలో కొత్త అధ్యాయం ప్రారంభిస్తున్నామని సంతోషం వ్యక్తం చేసింది. రిసెప్షన్‌కు పలువురు ప్రముఖులు హాజరుకానుండటంతో భద్రతా ఏర్పాట్లు చేశారు.




## ‘క్రేజీ కళ్యాణం’ ఫస్ట్ లుక్ విడుదల

దర్శకుడు, నటుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ‘క్రేజీ కళ్యాణం’ చిత్రానికి హోలీ సందర్భంగా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు. ఇందులో ఆయన పోషిస్తున్న ‘బాలరాజు’ పాత్రను పరిచయం చేశారు. పోస్టర్‌లో సూపర్ మ్యాన్ వేషధారణలో కనిపించిన తరుణ్ భాస్కర్ పాత్ర వినోదాత్మకంగా, ఉత్సాహభరితంగా ఉండబోతున్నట్లు స్పష్టమైంది. తెలంగాణ గ్రామీణ నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్ కథానాయికగా నటిస్తోంది. బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాను బూసం జగన్ మోహన్ రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తయ్యి ప్రస్తుతం అనంతర నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.



## భార్యకు రూ.250 కోట్ల భరణం ఆఫర్ చేసిన విజయ్?

తమిళనాడు రాజకీయాల్లో చురుకుగా ఉన్న నటుడు విజయ్ వ్యక్తిగత జీవితం చర్చనీయాంశంగా మారింది. తనను భర్త హింసిస్తున్నాడని, ఓ నటితో సంబంధం పెట్టుకున్నాడని ఆరోపిస్తూ భార్య సంగీత చెంగల్‌పట్ కోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. విడాకులు మంజూరు చేయాలని ఆమె పిటిషన్ దాఖలు చేసినట్టు వార్తలు వచ్చాయి. ఈ వివాదాన్ని కోర్టు వరకు తీసుకెళ్లకుండా సామరస్యంగా పరిష్కరించుకోవాలని విజయ్ నిర్ణయించుకున్నట్లు జాతీయ మీడియా కథనాలు పేర్కొంటున్నాయి. ఇందుకోసం దాదాపు రూ.250 కోట్ల భరణం ఆఫర్ చేసినట్టు సమాచారం. భార్యతో పాటు ఇద్దరు పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అయితే ఈ వ్యవహారంపై విజయ్ లేదా ఆయన కుటుంబ సభ్యుల నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. పరస్పర అంగీకారం కుదిరితే వివాదం కోర్టు బయటే ముగిసే అవకాశం ఉందని, లేకపోతే చట్టపరమైన ప్రక్రియ కొనసాగవచ్చని చెబుతున్నారు.

## యూట్యూబ్‌ను షేక్ చేస్తున్న ‘రై రై రారా’ సాంగ్

**విడుదలైన కొన్ని గంటల్లోనే మిలియన్ల వ్యూస్**

‘పెద్ది’ చిత్రంలోని రెండో పాట ‘రై రై రారా’ విడుదలైన వెంటనే విశేష స్పందన దక్కించుకుంది. యూట్యూబ్‌లో ఈ గీతం వేగంగా ట్రెండింగ్‌లోకి చేరి ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ పాటకు ఇప్పటికే 31 మిలియన్లకు పైగా వ్యూస్ లభించాయి. రియల్ టైమ్‌లో 5 లక్షలకు పైగా వ్యూస్, 30 వేలకుపైగా లైక్స్ సాధించింది. విడుదలైన కొద్ది గంటల్లోనే ఈ స్థాయి ఆదరణ దక్కడం విశేషంగా మారింది. పాటలోని బీట్‌లు, నృత్య కదలికలు అభిమానులను ఉత్సాహపరుస్తున్నాయి. ఏఆర్ రెహమాన్ అందించిన సంగీతం ఈ గీతానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తక్కువ సమయంలోనే భారీ స్పందన లభించడం చిత్ర బృందానికి ఉత్సాహాన్ని ఇచ్చింది.



Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com